ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

గురువారం 3 ఏప్రిల్ 2025 | 5

సత్యవాడ... నవమి శోభ 6

6న ర్యాలి కేశవస్వామి కల్యాణం 6

ఉత్తమ నాటిక ప్రదర్శనలకు బహుమతుల ప్రదానం 6



ఎన్నాళ్లీ.. నిరీక్షణ!

- చంద్రబాబు కలల ప్రాజెక్టు టిడ్కో
- ప్రభుత్వమొస్తే కష్టాలు తీర్చేస్తామని ఎన్నికల హామీ
- వచ్చి పది నెలలు దాటినా అడుగు ముందుకు పడని వైనం
- జూన్ 12 నాటికి ఇళ్లు అప్పగించాలని తాజా లక్ష్యం
- మౌలిక సదుపాయాలు లేకుండా ఎలా ఉండేదని లబ్ధిదారుల ప్రశ్న
- ఉన్న ఫ్లాట్లూ అస్తవ్యస్తం.. తాగునీరే లేని దుస్థితి
- నేడు విజయవాడలో రాష్ట్రస్థాయి టిడ్కో సమావేశం

పేదవాడి సొంతింటి కలను నిజం చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాల నిర్మాణం పెద్దఎత్తున జరిగింది. అపార్టుమెంటు తరహాలో చేసిన ఈ ఇళ్ల కోసం లబ్ధిదారులు పోటీపడ్డారు. సర్వహంగులతో గేటెడ్ కమ్యూనిటీ కాలనీలుగా నిర్మించిన ఈ భవనాలు చూసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. దశల వారీగా చేపట్టిన ఈ ఫ్లాట్ల నిర్మాణం తొలి దశ పూర్తికావడంతో లబ్ధిదారులకు అందించారు. మలి దశ ఫ్లాట్ల నిర్మాణమూ పూర్తయింది. కానీ ఈలోపు ఎన్నికలు రావడంతో గృహ ప్రవేశాలు చేసుకుందామని సిద్ధమైన వారికి ఆ అవకాశం చిక్కలేదు. ఎన్నికలయ్యాక వైసీపీ ప్రభుత్వం ఈ కాలనీలను గాలికి వదిలేసింది. లబ్ధిదారులు ఎన్నిసార్లు ప్రాధేయపడినా ఏదొక నెపంతో ఐదేళ్లు కాలం గడిపేసింది. మౌలిక సదుపాయాలనూ పట్టించుకోలేదు. తమ పార్టీ రంగులు వేసి మమ అనిపించింది. దీంతో మళ్లీ చంద్రబాబు సీఎం అయితేనే తమ ఇళ్లకు మోక్షం కలుగుతుందని లబ్ధిదారులంతా ఎదురు చూశారు. అనుకున్నట్టుగానే చంద్రబాబు సీఎం అయ్యారు. కొత్త ప్రభుత్వం వచ్చి పది నెలలు కావొస్తోంది. ఇప్పటికీ వీరి కష్టాలు తీరలేదు. చంద్రబాబు రాగానే ఈ కాలనీల తీరే మారిపోతుందని కలలు గన్న వారి ఆశలు తీరనేలేదు. ఇప్పటికైనా కాస్త మా కాలనీల వైపు చూడండయ్యా అంటూ లబ్ధిదారులు ఎమ్మెల్యేలను, అధికారులనూ వేడుకొంటున్నారు. నిజానికి జూన్ 12 నాటికి టిడ్కో గృహాల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు క్షేత్ర స్థాయిలో చొరవ లేదు. పైగా మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఎలా ఉంటామని లబ్ధిదారుల ప్రశ్న. ఈ నేపథ్యంలో ఏపీ టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విజయవాడలో టిడ్కో అధికారులు, ఇంజనీర్లు, సిబ్బందితో సమావేశం జరుగనుంది. మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించే అవకాశం ఉంది.



బొమ్మూరులో బాగు ఏదీ..

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాల్లో 2014-19 మధ్య పేదవాని సొంతింటి కలను నిజంచేస్తూ బొమ్మూరులో అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం టిడ్కో గృహాల నిర్మాణాలను చేపట్టి 99 శాతం పూర్తి చేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ గృహాలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందించలేకపోయింది. దాంతో ఐదేళ్ల పాటు 6,304 మంది లబ్ధిదారులు టిడ్కో గృహాల కోసం ఎదురుచూశారు. రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్న వరకైనా తమ ఇళ్లను అప్పగించాలని వేడుకుంటూనే ఉన్నారు. చివర్లో మాత్రం వైసీపీ రంగులు ఆ భవనాలకు వేసి హడావుడి చేసింది. కానీ ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదు. ఈలోపు ప్రభుత్వం మారింది. చంద్రబాబు సీఎం అయ్యారు. తమ కష్టాలు తొలగినట్టేనని లబ్ధిదారులు సంతోషపడ్డారు. కానీ అధికారంలోకి పది నెలలు కావొస్తున్నా ఇప్పటికీ అప్పగించలేదు. మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేయలేదు. ప్రస్తుతం బొమ్మూరులో ఉన్న టిడ్కో ఇళ్లలో సెప్టిక్ ట్యాంకుల కనెక్టింగ్ చేయాల్సి ఉంది. అలానే తొర్రేడులో ఉన్న టిడ్కో గృహాల వద్ద రహదారులు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాల్సి ఉంది.

పరిశీలన

అసౌకర్యాల చెరలో బొడసకుర్రు గృహాలు

తాగునీరు.. డ్రైనేజీ సమస్యలు

(అమలాపురం -ఆంధ్రజ్యోతి)

గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టిడ్కో గృహ సముదాయాలు నేడు అసౌకర్యాల చెరలో చిక్కుకుపోయాయి. వైసీపీ ప్రభుత్వం ఈ భవనాలకు రంగులు అయితే మార్చిందిగానీ నివాస గృహాల యజమానులకు అవసరమైన కనీస సౌకర్యాలపై దృష్టి సారించకపోవడంతో ప్రస్తుతం ఆయా టిడ్కో గృహాల్లో నివశిస్తున్న నివాసితులు నిరంతరం కష్టాలతోనే జీవనం గడుపుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో అమలాపురంలో 2017లో టిడ్కో గృహాల సముదాయానికి అప్పటి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. అయితే నిర్మాణంలో జాప్యం వల్ల లబ్ధిదారులు ఎంపికైనప్పటికీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని లబ్ధిదారులకైతే అందించారుగానీ అక్కడ కనీస సౌకర్యాల కల్పన చేపట్టలేదు. అమలాపురం పట్టణానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్లవరం మండలం బోడసకుర్రు శివారు దేవర్లంక బ్లోఅవుట్ సైట్ సమీపాన 2017లో 1632 టిడ్కో గృహాలను నిర్మించి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని లబ్ధిదారులకు 1576 గృహాలను అందించారు. వాటిలో ఇంకా 56 గృహాలను అర్హులకు అందించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 550 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటుండగా వెయ్యికి పైగా గృహాలు తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. ఇక సెకండ్ ఫేజ్‌లో 962 ఇళ్ల నిర్మించాల్సి ఉన్నప్పటికీ ఆ ప్రతిపాదనను ప్రభుత్వం దాదాపు విరమించుకున్నట్టే. ఇక్కడ మంచినీటి సమస్యతో డ్రైనేజీ సమస్య ఉంది. తాగునీరు లేకపోవడంతో అక్కడ నివాసం ఉండేందుకు ఎవరూ వెళ్లడం లేదు. పదిరోజులకోసారి బోడసకుర్రు టిడ్కో గృహాలకు మున్సిపల్ వాటరు ట్యాంకరు ద్వారా నీళ్ల పంపిస్తున్నారు. జనసేన నుంచి ఒక ట్యాంకరు ద్వారా నీళ్ల అందిస్తున్నారు. ప్రస్తుతం ఉంటున్న వారికి టిడ్కో గృహాల వద్దే రేషన్‌ను తీసుకునే సదుపాయం కల్పించినా పెన్షన్లు మాత్రం అమలాపురం పట్టణంలో వారి వారి వార్డులకు వెళ్లి 1వ తేదీన తీసుకోవాల్సిందే.





మండపేటలో మౌలిక సదుపాయాలేవీ..

మండపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017లో ఇళ్ల నిర్మాణం చేపట్టి 2019 నాటికి అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం పూర్తిచేసి ఎన్నికల ముందు 2019లో ఫేజ్1లో ఇళ్లను పేదలకు అందించారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రంగులు మార్చడం తప్ప మౌలిక వసతులు కల్పించలేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత పది నెలల నుంచి పట్టించుకోకపోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. అయితే జూన్ 12 నాటికి ఫ్లాట్లను లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం టార్గెట్ పెట్టింది. కానీ మౌలిక సదుపాయాల కల్పనలో పూర్తిస్థాయిలో జరగక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండపేట పట్టణం గొల్లపుంత కాలనీలో ఫేజ్1లో నిర్మించిన ఈ 4064 గృహాలకు సంబంధించి ఇప్పటివరకు 2564 మంది లబ్ధిదారులకు ఇళ్లను అందించారు. మిగిలిన 2200 ఇళ్లను కూడా అందించాలని తాజాగా నిర్ణయించారు. అయితే ఫేజ్ 2లో వాటర్ ట్యాంకు నిర్మాణం, విద్యుత్ పనులు, అంతర్గత రోడ్ల నిర్మాణాలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు పనులు చేసేందుకు కాంట్రాక్టర్‌లు ముందుకు రాలేదు.



రామచంద్రపురంలో అన్నీ సమస్యలే..

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో టిడ్కో గృహాలు నిర్మాణం పూర్తయినా మౌలిక వసతులు కల్పన పూర్తికాకపోవడంతో లబ్ధిదారులకు స్వాధీనం కావడం లేదు. పట్టణంలో మొదటి దశలో 1088 గృహాలు నిర్మాణం పూర్తికాగా 816 ఫ్లాట్లు లబ్ధిదారులకు స్వాధీనం చేశారు. మౌలిక వసతులు కూడా కల్పించారు. వివిధ కారణాలతో 272 ఫ్లాట్లు లబ్ధిదారులకు స్వాధీనం కాలేదు. దాంతో అవి శిథిలంగా మారుతున్నాయి. తలుపులు, కిటికీలు చెదలు పట్టి ఊడిపోయాయి. రెండవ దశలో నిర్మాణం చేపట్టిన 960 గృహాల నిర్మాణం సైతం పూర్తి చేశారు. వేస్టేజీ పైపులైన్లు, ట్యాంకు (ఎస్‌టీపీ) నిర్మాణం మొదలు పెట్టలేదు. అంతర్గత రహదారుల నిర్మాణం 96 శాతం పూర్తిచేశారు. డ్రింకింగ్ వాటర్ ట్యాంకులు, పైపులైన్లు నిర్మాణం మొదలు పెట్టలేదు. ఫ్లాట్లకు విద్యుత్ సరఫరా, వైరింగ్, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.



కాకినాడలోనూ అంతే..

కాకినాడ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పర్లోవపేటలో టిడ్కో గృహ సముదాయం ఉంది. ఇక్కడ తొలిఫేజ్‌లో 1152ఇళ్లు నిర్మించగా వాటిని లబ్ధిదారులకు అప్పగించారు. రెండో ఫేజ్‌లో 800 ఫ్లాట్లు నిర్మించగా లబ్ధిదారులకు అందించలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వీటి నిర్మాణం జరిగినా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిపట్ల పూర్తి నిర్లక్ష్యం వహించింది. దీంతో ఇప్పటివరకు తాగునీటి పైపులైన్లు, అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు వంటి సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించలేదు. ఈ సముదాయంలోని వాటర్ సంప్ పరిసరాలు అపరిశుభ్రంగా మారగా, సీవేజ్ వాటర్ డ్రెయిన్ దెబ్బతింది. ఇక ఏ వస్తువు కావాలన్నా దూర ప్రాంతానికి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు మహిళా మార్ట్ భవనం నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది.



వాలుతిమ్మాపురంలో ఎదురుచూపులే..

పెద్దాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం వాలుతిమ్మాపురంలో నిర్మించిన టిడ్కో భవనాలు రెండో విడత కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. మొదటి విడతలో 1724 ఇళ్లను అప్పట్లో టీడీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు అందించింది. రెండో విడతలో 1672 ఇళ్లను నిర్మించింది. ఈలోపు వైసీపీ ప్రభుత్వం రావడంతో టిడ్కో ఇళ్లను పట్టించుకోలేదు. దీంతో రెండో విడతలో నిర్మించిన టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించలేదు. 500 ఇళ్లకు వైరింగ్ చేయాల్సి ఉంది.

స్వాధీనం చేసుకోని ఇళ్ల రద్దుకు వెనకాడం

- టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు మండపేట మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక



టిడ్కో గృహాలవద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో మున్సిపల్ సిబ్బందితో కమిషనర్ రంగారావు

మండపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్వాధీనం చేసుకోని ఇళ్ల రద్దుకు వెనకాడబోమని మండపేట మున్సిపల్ కమిషనర్ రంగారావు టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను హెచ్చరించారు. మండపేట పట్టణంలోని 20వవార్డులో ఉన్న గొల్లపుంత టిడ్కో కాలనీలో ఫేజ్-1లో అప్పగించిన గృహాలకు సంబంధించిన లబ్ధిదారులు తమకు కేటాయించిన గృహాల్లో నివాసం ఉండకుంటే అలాంటివారి ఇళ్లను రద్దు చేసి వేరేవారికి ఇచ్చేందుకు వెనకాడబోమని ఆయన హెచ్చరించారు. టిడ్కో గృహాల సముదాయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన కార్యాలయం వద్దకు వచ్చి లబ్ధిదారులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ నెల 7వతేదీ నాటికల్లా లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్లలోకి రాకుంటే రద్దు చేస్తామని హెచ్చరించారు. రద్దయిన ఇళ్లకు సంబంధించి కమిటీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి కొత్తవారికి ఇళ్లను కేటాయిస్తామన్నారు. ఇప్పటివరకు ఇళ్లను కేటాయించినా ఇళ్లలోకి రానివారు తక్షణమే తాత్కాలికంగా టిడ్కో సముదాయం వద్ద ఏర్పాటు చేసిన కార్యాలయం వద్ద తమ సిబ్బంది వద్దకు వచ్చి ఎందుకు గృహ ప్రవేశాలు చేయలేదో చెప్పాలని కోరారు. టిడ్కో గృహసముదాయంవద్ద అపార్ట్‌మెంట్‌ల్లో బ్లాకులవారీగా సచివాలయ సిబ్బందిని నియమించి లబ్ధిదారుల సమస్యలతోపాటు ఎంతమంది గృహప్రవేశంచేసి ఇళ్లల్లో నివాసం ఉంటున్నారనే అంశాలను తెలుసుకుంటున్నారు. టిడ్కోగృహాల సముదాయంవద్ద సిబ్బందితోపాటు లబ్ధిదారులతో కమిషనర్ మాట్లాడి వారినుంచి సమాచారాన్ని సేకరించారు.కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, ఏఈలు డి.పవన్, ఆంజనేయులు, మెప్మా డీసీఎం సుజాత, సచివాలయ ఉద్యోగులు ఆర్‌పీలు పాల్గొన్నారు.

స్నానానికి వెళ్లి.. శాశ్వతంగా దూరమై!

- కాకినాడలో విషాదఘటనలు
- ఏలేశ్వరం, పెద్దాపురంల్లో స్నానానికి దిగి నలుగురి మృతి 7

సోర్ప్స్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

- జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీఎస్ సురేష్‌కుమార్

అమలాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్‌లో ఆరు వారాల సర్టిఫికెట్ కోర్సుకు ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌స్పోర్ట్స్ పాటియాలా సంయుక్తఆధ్వర్యంలో స్పోర్ట్స్‌లో ఆరువారాలపాటు శిక్షణ అందిస్తామన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో శిక్షణ ఉంటుందని, మే 6 నుంచి జూలై 2 వరకు నిర్వహించే శిక్షణకు ఈనెల 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్, హ్యాండ్‌బాల్, హాకీ, జూడో, కబడ్డీ, ఖోఖో, రోల్‌బాల్, రోయింగ్, సాఫ్ట్‌బాల్, షూటింగ్, స్విమ్మింగ్, తైక్వాండో, టేబుల్ టెన్నిస్, లాంగ్‌టెన్నిస్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, యోగాసన మొదలైన 29 క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. జిల్లాలోని ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సురేష్‌కుమార్ కోరారు.

మహిళ మాయలో పడిన సహకార ఉద్యోగి

- చికిత్స పొందుతూ మృతి 7
- మహిళతోపాటు సహకరించిన ఇద్దరిపై హత్య కేసు నమోదు

గోదావరి డెల్టాకు 7 వరకు నీటి విడుదల 7

ఎమ్మెల్సీగా పేరాబత్తుల ప్రమాణ స్వీకారం 7

నిర్మాణం పూర్తి కాకుండానే.. బీటలు

- గత ప్రభుత్వ హయాంలో ముమ్మిడివరం పీఏసీఎస్ గోదాము నిర్మాణం ప్రారంభం
- నాణ్యతా ప్రమాణాలు లేక ఇంకా పూర్తి కాకుండానే బీటలు



నిర్మాణం పూర్తి కాకుండానే బీటలు తీసిన గోదాము గోడలు.. పక్కనే నిర్మాణ దశలోనే బీటలు తీస్తున్న ప్లాట్‌ఫామ్

ముమ్మిడివరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం పీఏసీఎస్ గోదాము నిర్మాణం పూర్తి కాకుండానే గోడలు బీటలు తీస్తున్నాయి. దాని ఎదుట నిర్మించిన ప్లాట్‌ఫామ్ కూడా బీటలు తీయడంపై పనుల్లో నాణ్యత పాటించాలని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఆధ్వర్యంలో బలవంతంగా బహుళార్థక, సాధక సౌకర్య కేంద్రాలు(ఎంపీఎఫ్‌సీ) గోదాముల నిర్మాణం చేపట్టారు. సహకార పరపతి సంఘాలకు గోదాములు ఉన్నా మరో గోదాము నిర్మించి తీరాలని ఆదేశాలు చేశారు. పెద్ద సంఘాలైతే వెయ్యిమెట్రిక్ టన్నుల గోదాము, చిన్న సంఘాలైతే 500 మెట్రిక్ టన్నుల గోదాములు నిర్మించాలని ఆదేశించింది. వీటి నిర్మాణకాంట్రాక్టును అప్పటి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారావుకు చెందిన బంధువుకు దారాదత్తం చేశారు. కొన్ని సహకార సంఘాల అధ్యక్షులు వీటిని వ్యతిరేకించినా కొంతమంది నిర్మాణం చేపట్టారు. ఈ గోదాము నిర్మాణానికి అయ్యేఖర్చును డీసీసీబీ సహకార సంఘానికి రుణంగా ఇస్తుంది. సకాలంలో అప్పు వాయిదా చెల్లిస్తే 4శాతం, వాయిదా సమయం మీరితే 8శాతం వడ్డీ చెల్లించాలి.

అంచనాలు పెంచేసి..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం పీఏసీఎస్ మాత్రమే 500 మెట్రిక్ టన్నుల గోదామును నిర్మాణానికి ముందుకు వచ్చింది. దీంతో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ 33ఏళ్ల లీజుతో 25 సెంట్ల భూమిని సమకూర్చగా 2022, జూలై 21న రూ.36లక్షలతో గోదాము, ప్లాట్‌ఫామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అంచనా వ్యయాన్ని రూ.44లక్షలకు పెంచారు. ప్రస్తుతం ఇంకా నిర్మాణం పూర్తి కాకుండానే గోదాము గోడలు బీటలు తీస్తున్నాయి. గోదాము ఎదుట నిర్మించిన ప్లాట్‌ఫామ్ కూడా బీటలు తీస్తోంది. గోదాము నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంవల్ల గోడలు బీటలు తీశాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గోశాలల బిల్లులకు మోక్షమెప్పుడు?

- నిర్మించి మూడు నెలలైనా మంజూరు కాని సొమ్ములు



మలికిపురంలో గతంలో ప్రారంభించిన గోశాల

మలికిపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాడి రైతులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం గోశాలలు నిర్మించాలని భావించింది. వీటిని ఉపాధి హామీ పథకంలో నిర్మించేలా డిసెంబరు నెలలో రాష్ట్రమంతా ఉత్తర్వులు మంజూరు చేశారు. దీనిలోభాగంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 989 గోశాలలు మంజూరయ్యాయి. వీటికి రూ.20కోట్ల వరకు లబ్ధిదారులకు మంజూరు చేశామని తెలిపారు. ఉపాధి సిబ్బంది సంక్రాంతి నాటికి డబ్బులు మీ ఖాతాల్లో పడతాయని రైతులకు తెలపడంతో అప్పులు చేసి గోశాలలను నిర్మించారు. గోశాలలు నిర్మించి మూడు నెలలు అయినా ప్రభుత్వంనుంచి సొమ్ములు మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మలికిపురం మండలంలో 60గోశాలలు, సఖినేటిపల్లి మండలంలో 28 గోశాలలు మంజూరయ్యాయి. మలికిపురంలో 23, సఖినేటిపల్లిలో 24 గోశాలల నిర్మాణాలు పూర్తి చేశారు. ప్రభుత్వంనుంచి వచ్చేడబ్బులకోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 711 గోశాలలు పూర్తయ్యాయని, వీటికి రూ.7కోట్ల వరకు ప్రస్తుతం చెల్లించాల్సి ఉందని డ్వామా పీడీ మధుసూదన్ తెలిపారు. ప్రభుత్వంనుంచి నిధులు మంజూరైన వెంటనే ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం కోసమే.. శాస్త్రీయ అనుభవ యాత్ర

- కలెక్టర్ మహేష్‌కుమార్



శాస్త్రీయ అనుభవ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అమలాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విజ్ఞానంపై విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం అందించేందుకు జిల్లా విద్యాశాఖ చేపట్టిన కార్యక్రమం అభినందనీయమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. ప్రత్యక్ష అనుభవం కోసం విద్యార్థులతో శాస్త్రీయ అనుభవ యాత్ర నిర్వహించడం మంచి పరిణామమన్నారు. జిల్లాలో ప్రాథమికస్థాయి నుంచి 5వ తరగతి విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ నెల 4, 5 తేదీల్లో శాస్త్రీయ అనుభవ యాత్ర నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం అనుభవ యాత్ర గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. శాస్త్రీయ అంశాలపై అవగాహన పెంచుకునేందుకు విద్యార్థులకు ఈ యాత్ర ఎంతో ఉపకరిస్తుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా మాట్లాడుతూ ఈ యాత్రలో 132మంది విద్యార్థులు, 20మంది గైడ్ టీచర్లు పాల్గొంటారన్నారు. వివిధప్రదేశాలను సందర్శించి అక్కడి ప్రత్యేకతలు, శాస్త్రీయ విశేషాలు తెలుసుకుని విద్యార్థులస్థాయినుంచి పూర్తి నివేదికను జిల్లా యంత్రాంగానికి అందజేస్తారన్నారు. తొలిరోజు యానాం, అనకాపల్లి జిల్లా సందర్శన ఉంటుందని, జిప్‌మర్ వైద్యరంగ పురోగతులు, బొటానికల్ గార్డెన్‌లో వృక్ష జీవ అధ్యయనం, ఏటికొప్పాక చెక్కబొమ్మల పరిశ్రమ-సంప్రదాయ హస్తకళలపై అవగాహన, సాయంత్రం విశాఖ చేరుకుని బస చేస్తారన్నారు. రెండోరోజు విశాఖపట్నంలోని తొట్లకుండ, భవికొండ బౌద్ధ స్థూపాల సందర్శన, రిషికొండ బీచ్, సముద్రతీర పర్యావరణ అధ్యయనం, రామానాయుడు ఫిల్మ్‌స్టూడియో, విశాఖలోని పలు ప్రాంతాలను సందర్శిస్తారన్నారు. ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల, కె.మాధవి, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సమగ్రశిక్ష అకడమిక్ మోనిటరంగ్ అధికారి పి.రాంబాబు పాల్గొన్నారు.

భూ వివాదాలకు తావులేకుండా రీసర్వే నిర్వహించాలి: కలెక్టర్

అమలాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో భూవివాదాలకు తావులేకుండా రీసర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. భూముల రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిబద్ధతతో, జవాబుదారీతనంతో నిర్వహించాలన్నారు. అమరావతినుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎన్.ప్రభాకర్‌రెడ్డి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జిల్లాలో నీటి తీరువా వసూళ్ల ముమ్మరం చేయాలని సూచించారు. పైలెట్ గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి రెండో దశలో మండలానికి రెండు గ్రామాల చొప్పున సర్వే నిర్వహణకు సన్నద్ధం కావాలని ఆదేశించారు. ప్రభుత్వం ఇటీవల రీసర్వే బృంద సభ్యులతో కూడిన మొబైల్ యాప్‌ను రూపొందించిందని, యాప్‌లో బృంద సభ్యులంతా లాగిన్ అవ్వాలని తెలిపారు. రీసర్వే డేటాను, 6(1) నోటీసులు ఈ యాప్ ద్వారానే సమర్పించాలన్నారు. రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలన్నారు. వెబ్‌ల్యాండ్‌రికార్డు ల ప్రకారం రీసర్వే ప్రక్రియను నిర్వహించాలన్నారు. సర్వేప్రక్రియపై రైతులకు సందేహాలుంటే క్షేత్రస్థాయి సిబ్బంది వారికి నివృత్తి చేయాలన్నారు. రీసర్వే తరువాత భూహక్కు పత్రాలు తేడా లేకుండా చూడాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూముల వర్గీకరణతో భూరికార్డులను డిజిటలైజేషన్ చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల, కె.మాధవి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కె.ప్రభాకర్, ఎస్ఈడీసీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కొంగలు... కాదండీ!



ఈ చెట్టును చూశారా.. చెట్టుకు కొంగలు కాసినట్టు ఉంది కదా!.. అటుగా వెళ్లే వాళ్లు ఆగి ఆశ్చర్యంగా చూస్తున్నారు కానీ ఇవి కొంగలు కాదు. బూరుగు కాయలు. వేసవిలో ఆకులన్నీ రాలిపోవడంతో దూరం నుంచి ఈ బూరుగు కాయలు కొంగల్లా కనిపిస్తూ కళ్లకు పరీక్ష పెడుతున్నాయి మరి! తూర్పు గోదావరి జిల్లా కడియపులంక వద్ద జాతీయ రహదారి పక్కన ఈ చెట్టు కనువిందు చేస్తోంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



అదిరే ఎండ... బొమ్మలే అండ



ఎండలు మండుతున్నాయి... రోడ్లపై జన సంచారం తగ్గుతోంది... కాళ్లరిగేలా తిరిగినా కొనేవారే కరువయ్యారు... చేసేదేముంది... కాకినాడ శాంతినగర్‌లో అలసి సొలసిన ఓ విక్రయదారుడు ఆ బొమ్మల నీడనే కాస్త విశ్రాంతి తీసుకుంటూ ఇలా కనిపించాడు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

నల్లమట్ట... చిక్కిందోచ్!

కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ నుంచి బుధవారం తెల్లవారు జామున సముద్రంపై వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రసాద్ వలకు అరుదైన నల్లమట్ట చేప చిక్కింది. సుమారు 20 కిలోల బరువున్న ఈ చేపకు మినీ హార్బర్ దగ్గర వేలంపాట నిర్వహించగా కాకినాడకు చెందిన టోకు వ్యాపారస్తుడు రూ.6వేలకు పాడుకున్నాడు. సముద్రంలో చాలా అరుదుగా దొరికే ఈ చేప రుచి అమోఘంగా ఉంటుందని మత్స్యకారులు చెప్తున్నారు.

- కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)



సత్యవాడ... నవమి శోభ

- శ్రీరామ నవమి ఉత్సవాలకు ముస్తాబవుతున్న గ్రామం
- భద్రాచలంలో మాదిరిగానే చలువ పందిళ్లలో సీతారాముల కల్యాణం
- పూల కుండీలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్న గ్రామస్తులు

ఆధ్యాత్మిక వాడగా పేర్గాంచింది సత్యవాడ. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరంలోని ఈ గ్రామం శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ప్రతిచోటా శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తారు. కానీ ఇక్కడ జరిగే ఉత్సవాలకు ఓ ప్రత్యేకత ఉంది. భద్రాచలంలో జరిగే విధంగానే ఇక్కడా సీతారాముల కల్యాణం జరుపుతారు. అక్కడ మాదిరిగానే ఆరు బయట చలువ పందిళ్లు వేసి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ప్రతి ఇంట్లోనూ ఆడపడుచులను, బంధువులను ఆహ్వానించి తమ ఇంట్లో పెళ్లి మాదిరిగా స్వామివారి కల్యాణం జరుపుతారు.



చెరువు వీధిలో సీతారాములు

కె.గంగవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సత్యవాడ గ్రామంలోని చెరువు వీధి, పెద్ద వీధి, కొత్తపేట వీధుల్లో చలువ పందిళ్లలోను, రామయ్య వీధి, బీసీ, ఎస్సీ కాలనీలు, గ్రామ శివారు ఖండ్రిక, రాయిచెరువుల్లోని ఆలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి తిలకిస్తారు. తలంబ్రాలు సమయంలో వాటిని ఒడిసి పట్టి ఇళ్లకు తీసుకెళ్తారు. పిల్లలు లేనివారు వాటిని కొన్ని తలపై వేసుకుని, పూజా మందిరంలో పెట్టి పూజిస్తే సంతానం కలుగుతుందని నమ్ముతున్నారు. ఇలా కొంతమందికి జరిగిందని గ్రామస్తులు చెప్తున్నారు. విద్యార్థులు కల్యాణంలో పాల్గొని స్వామిని పూజిస్తే మంచి విజయాలు సాధిస్తారని ఇక్కడి వారి నమ్మకం. ప్రస్తుతం చలువ పందిళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది.

ఇక్కడ చలువ పందిళ్లను ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఒక్కో చలువ పందిరి డెకరేషన్‌కు రూ.3 లక్షలు నుంచి రూ.5 లక్షలు ఖర్చు చేస్తారు. అలంకరణ కోసం గ్రామంలోని ప్రతి ఒక్కరూ రేయింబవళ్లూ కష్టపడతారు. మహా శివరాత్రి పర్వదినం నుంచి పందిళ్లలో అలంకరించే పూల కుండీల తయరీలో నిమగ్నమవుతారు. ఉగాది నుంచి పందిళ్ల నిర్మాణం చేపడతారు. పూల కుండీలు ప్రత్యేక ఆకర్షణ. ప్రత్యేకంగా విజయవాడ నుంచి తీసుకుని వచ్చిన క్రేప్, గున్న పేపరు, వార్నిష్ పేపరుతో గులాబీ, చామంతి, మందారం, మల్లె, పొద్దుతిరుగుడు, నైట్‌క్వీన్ వంటి పూలను కాగితాలతో తయారు చేస్తారు. 50-60 పూలతో ఒక కుండీని తయారు చేస్తారు. ఒక్కో పందిరిలో సుమారు 50 కుండీలు, అంత కంటే ఎక్కువ అలంకరిస్తారు. ఇవి సహజమైన పూల మాదిరిగా చూపరులను ఆకట్టుకుంటాయి.



తయారైన పూల కుండీలు



పూల కుండీ తయారు చేస్తున్న యువకుడు



ఆకర్షణీయంగా కాగితం పువ్వు



కొత్తపేట వీధిలో కొలువైన సీతారాములు



నైట్‌క్వీన్ పూల కుండీ



సీతారాముల కల్యాణానికి నిర్మించిన చలువ పందిరి

సత్యవాడలో సీతారాముల కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయడానికి గ్రామస్తులంతా శ్రమదానం చేస్తారు. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అందరూ పందిరి అలంకరణలో పాల్గొంటారు. చందాలు వేసుకుని, కావాల్సిన ముడిసరుకు కొనుగోలు చేసి పూల కుండీలు తయారు చేస్తారు. దీనికోసం కొంత సమయం కేటాయిస్తారు.

ఈ నెల 6వ తేదీన సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చకచకా జరుగుతు న్నాయి. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. గ్రామాల్లో వీధుల్లో లైటింగ్ పెడుతున్నారు.



తెల్ల మందారం పూల కుండీ



పొద్దుతిరుగుడు పూల కుండీ







గులాబీ, కనకాంబరం, సంపెంగ పూల కుండీలు

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం దక్కించుకున్న

దివాన్‌చెరువు యువకుడు

- బబ్లూ వేసిన వేంకటేశ్వరస్వామి చిత్రం

దివాన్‌చెరువు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువుకు చెందిన యువకుడు బబ్లూ డాంగి బియ్యపు గింజలతో వేసిన తిరుపతి వెంకటేశ్వరస్వామి చిత్రం ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం దక్కించుకుంది. ఈసందర్భంగా బబ్లూ ఆంధ్రజ్యోతితో బుధవారం ఫోన్‌లో మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌కు చెందిన తమ కుటుంబం దాదాపు 27 సంవత్సరాలుగా దివాన్‌చెరువులోనే నివాసం ఉంటోందన్నారు. తన తండ్రి దివాన్‌చెరువులో పానీపూరి అమ్ముతారని తాను ప్రస్తుతం డిల్లీలోని కళాశాలలో ఫైన్ ఆర్ట్స్ అభ్యసిస్తున్నానన్నారు. తనకు చిన్నతనం నుంచి చిత్రలేఖనం అంటే ఎంతో ఇష్టమని, తమ తల్లిదండ్రుల సహకారం, మామయ్య ప్రోత్సాహంతో తాను ఆ రంగంవైపు దృష్టి సారించానన్నారు. తనచెల్లెలు ఇంటర్ రెండో సంవత్సరం అభ్యసిస్తున్నారని చెప్పారు. తాను బాస్మతి బియ్యం, ఎకరిలిక్ రంగులు, ఫెవికాల్ ఉపయోగించి రెండు అడుగుల వెంకటేశ్వరస్వామి చిత్రాన్ని వేశానని చెప్పారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో ఈచిత్రం స్థానం దక్కించుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఇదేవిధంగా తాను గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డులో కూడా స్థానం దక్కించుకోవాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని చెప్పారు.



ఇండియన్ బుక్‌ఆఫ్ రికార్డ్సులో స్థానం దక్కించుకున్న బబ్లూ వేసిన చిత్రం

6న ర్యాలి కేశవస్వామి కల్యాణం

- కేశవ దీక్షలు చేపట్టిన 300 మంది

ఆత్రేయపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పురాన ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవ స్వామి వార్షిక కల్యాణోత్సవం ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకూ వైభవంగా నిర్వహించనున్నారు. 6న స్వామివారి కల్యాణం వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించనున్నారు. మంగళవారం కల్యాణోత్సవం పోస్టర్‌ను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆవిష్కరించారు. అనంతరం తొలి ఆహ్వాన పత్రికను ఈవో బీహెచ్వీ రమణమూర్తి ఎమ్మెల్యే సత్యానందరావుకు అందజేశారు. స్వామివారి ఆలయంలో సుమారు 300 మంది భక్తులు కేశవమాల దీక్షను ధరించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులు మాలధరించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉచితంగా ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. కల్యాణోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి కల్యాణోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

అవాంటెల్‌తో జేఎన్టీయూకే ఎంవోయూ

జేఎన్టీయూకే, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని యూసీఈకే ఈసీఈ విభాగం ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్స్‌లో కొలాబొరేటివ్ ప్రోగ్రామ్ నిర్వహించేందుకు అవాంటెల్ లిమిటెడ్ కంపెనీతో బుధవారం ఉదయం వీసీ సమావేశహాల్లో ఎంఓయూ కుదుర్చుకుంది. ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ యూసీఈకే ఒక ప్రముఖ విద్యాసంస్థగా పేరొందడంతోపాటు పూర్వ విద్యార్థులు భారతదేశం, విదేశాలలో చాలా కీలకమైన స్థానాలలో ఉన్నారన్నారు. ఈసీఈ విభాగంలో ఏర్పాటుకానున్న సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్స్ స్పెషలైజేషన్ కోర్సు విజయవంతమవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అవాంటెల్ చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ తమ కంపెనీ విశాఖపట్నం, హైదరాబాద్‌లలో మూడు దశాబ్దాలపాటూ భారత రక్షణసేవలు, అనుబంధ సంస్థలకు ప్రత్యేకమైన ఉత్పత్తులను అందిస్తున్నామన్నారు. ప్రతిఏటా 25మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ, విద్యాసాగర్, శ్రీనివాసరావు ఎంవోయూపై సంతకాలు చేయగా వీసీ ప్రసాద్, అవాంటెల్ చైర్మన్ విద్యాసాగర్ అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాద రాజు, పద్మరాజు, శ్రీనివాసకుమార్, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయభాస్కర్, ఓఎస్డీ కోటేశ్వరరావు, డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వీసీ ప్రసాద్, అవాంటెల్ చైర్మన్ విద్యాసాగర్

ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అని, వాళ్ల తరపున వాదించడానికి న్యాయవాది లేకపోతే జిల్లా న్యాయ సేవాధికారం సంస్థ(డీఎల్ఎస్ఏ) ద్వారా నియమిస్తామని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆమె కేంద్ర కారాగారాన్ని, మహిళా ప్రత్యేక కారాగారాన్ని సందర్శించారు. వసతి సదుపాయాలు, ఆహారాన్ని పరిశీలించారు. ఖైదీల సమస్యలను ఎప్పటికప్పుడు సంస్థ దృష్టికి తీసుకురావాలని పారా లీగల్ వలంటీర్లను ఆదేశించారు. అనాలోచిత పనులవల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, చెడు స్నేహాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఖైదీలకు హితవు పలికారు.

ఉత్తమ నాటిక ప్రదర్శనలకు

బహుమతుల ప్రదానం



ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన స్వేచ్ఛ నాటిక కళాకారులకు బహుమతి అందిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

రావులపాలెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీ కాటన్ కళాపరిషత్ వేదికపై మూడు రోజులపాటు నిర్వహించిన నాటిక పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన మూడు నాటికలకు బహుమతులను అందజేశారు. ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కల్చరల్ వారి స్వేచ్ఛ నాటిక, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా సాయి ఆర్ట్సువారి జనరల్ బోగీలు, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా మైత్రి కళా నిలయం వారి బ్రహ్మస్వరూపం నాటికలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి. దీంతో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కాటన్ కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ సినీ రచయిత తనికెళ్ళ భరణి, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లమల్లి వీరరాఘవ రెడ్డి, పలివెల త్రిమూర్తులుతోపాటు సీఆర్సీ కార్యవర్గ సభ్యులు బహుమతులు, ప్రశంసా పత్రాలు ఆయా నాటిక కళాకారులకు అందజేశారు.

అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనకు

చురుగ్గా ఏర్పాట్లు: కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనను వేడుకగా నిర్వహించడానికి రాష్ట్ర సాంస్కృతికశాఖ, నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకూ సెంట్రల్ జైలు రోడ్డులో నిర్వహించే వేడుకల్లో భాగంగా 500 ప్రదర్శనలకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. సమన్వయాధికారిగా మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనలను తిలకించాలని ఆమె కోరారు.



చిత్రకళాప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

స్నానానికి వెళ్లి...శాశ్వతంగా దూరమై!

- కాకినాడ జిల్లాలో విషాదఘటనలు
- కాండ్రకోట ఏలేరు కాలువలో స్నానానికి దిగి ఇద్దరి మృతి
- పెద్దనాపల్లి ఏలేరు కాలువలో మరణించిన ఇద్దరు యువకులు
- శోకసంద్రంలో కుటుంబసభ్యులు



కాండ్రకోటలో మరణించిన కొప్పాడి బాలు, నాగవిశాల్ వర్మ (ఫైల్ ఫొటోలు)


సంఘటనా స్థలం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పెద్దాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి దర్శనానికి వచ్చి ప్రమాదవశాత్తు ఏలేరు కాలువలో నీట మునిగి ఒకే కుటుంబానికి చెందిన యువకుడు, బాలుడు మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. యానాంకు చెందిన కొప్పాడ సత్తిబాబు, తిరమూడి రాజు కుటుంబాలు ఈ నెల 1న నూకాలమ్మ దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం సమీపంలోని ఓ తోటలో వంట వండుకుని కుటుంబ సమేతంగా అందరూ కలిసి భోజనాలు ముగించుకుని ఆనందంగా గడిపారు. ఇంతలో కొప్పాడ బాలు(20), తన మేనల్లుడు తిరుమాడి నాగవిశాల్ వర్మ (8) స్థానిక ఏలేరు కాలువలోకి స్నానానికి వెళ్లారు. సాయంత్రం అయిన వారు రాకపోవడంతో వారి కోసం ఎదురుచూసిన కుటుంబీకులు వారికి ఆచూకీ దొరకలేదు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలకు తెలియజేయడంతో స్థానిక పోలీసులకు వారు సమాచారం అందించారు. చీకటి పడిపోవడంతో మర్నాడు ఉదయాన్నే ఎస్‌ఐ మౌనిక, అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో ఏలేరు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈలోగా బాలుడు వర్మ మృతదేహం ఉదయం కనుగొన్నారు. బాలు మృతదేహం కోసం మరో 3 గంటలు వరకు పోలీసు, అగ్నిమాపక సిబ్బంది ఏలేరు కాలువలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టడంతో సాయంత్రానికి మృతదేహం లభ్యమైంది. 2 మృతదేహాలను శవపంచనామా నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బాలుకు తల్లితండ్రి తో పాటు చెల్లి హారిక ఉంది. ఆ కుటుంబాలు చిరు ఉద్యోగాలతో జీవనం సాగిస్తుండగా మృత్యువు కబళించడంతో ఆ కుటుంబ సభ్యులు పెట్టిన రోదన చూపరులను కంటతడి పెట్టించాయి. వర్మ నాల్గోతరగతి చదువుతూ మేనమామతో ఉంటున్నాడు. ఎనిమిదేళ్ల ప్రాయంలోనే మృత్యు వు కాటేయడంతో 2 కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.


పెద్దనాపల్లిలో మరణించిన జీవన్, తరుణ్


ఫైల్ ఫొటోలు

ఏలేశ్వరం/జగ్గంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఏలేరు నదిలో స్నానానికి వెళ్లి ఇద్దరు యువకులు మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో జరిగింది. జగ్గంపేట గ్రామానికి చెందిన దేవర జీవన్‌కుమార్ (19), మెల్లి వీరవెంకట దుర్గ అలియాస్ తరుణ్(19)లు మిత్రులతో కలిసి బుధవారం స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు కిర్లంపూడి- ఏలేశ్వరం సరిహద్దులో ఉన్న ఏలేరు కాలువలోకి దిగారు. అయితే జీవన్‌కుమార్, తరుణ్‌లు నీటిలో కొట్టుకుపోవడంతో తోటి స్నేహితులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న జగ్గంపేట సీఐ వైఆర్‌కె.శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్‌ఐ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటన ఏలేశ్వరం పరిధికి రావడంతో ఏలేశ్వరం ఎస్‌ఐ రామలింగేశ్వరరావుకు సమాచారం అందించగా ఆయన అక్కడ చేరుకున్నారు. జగ్గంపేటకు చెందిన మొత్తం ఏడుగురు యువకులు పెద్దనాపల్లి శివారులో ఏలేరు కాలువలో స్నానానికి వెళ్లగా ప్రమాదశాత్తు నీటిలో మునిగిపోవడంతో జీవన్‌కుమార్, తరుణ్ మృతి చెందినట్టు ఆయన తెలిపారు. వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు చెప్పారు. యువకుల మృతితో జగ్గంపేటలోని యాదవపేటలో విషాదచాయలు అలముకున్నాయి. జీవన్ ఇటీవల ఇంటర్ పరీక్షలు పూర్తి చేశాడు. అతడి తల్లిదండ్రులు దేవర వాసు, వరలక్ష్మి. తాపీ పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్న కొడుకు మృతిచెందడంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు. తరుణ్ తండ్రి రాంబాబు దేవుడి బొమ్మలు తయారు చేస్తుంటాడు. చేతికి అంది వచ్చిన కొడుకు మృతిచెందడంతో తండ్రితో పాటు కుటుంబసభ్యులు తీవ్ర వేదన చెందుతున్నారు.

గోదావరి డెల్టాకు 7 వరకు నీటి విడుదల

ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు


డొంకరాయి జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సు నుంచి గోదావరి డెల్టా రబీ పంటలకు నీటి విడుదలను ఈ నెల 7వ తేదీ వరకు పొడిగించినట్టు ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు తెలిపారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటలకు డొంకరాయి జలాశయం స్పిల్‌వే ద్వారా విద్యుత్ ఉత్పత్తి లేకుండా నేరుగా 5వేల క్యూసెక్కులు, పొల్లూరు జల విద్యుత్ కేంద్రం నుంచి 4300 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. డొంకరాయి జలాశయం ద్వారా ఫిబ్రవరి 10 నుంచి మార్చి 31 వరకు ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదలచేయాలని తొలుత కోరారన్నారు. అయితే రబీ పంటలకు ఇంకా నీటి అవసరం ఉన్న నేపథ్యంలో ఏప్రిల్ 7 వరకు డొంకరాయి నుంచి 5వేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ఫిబ్రవరి 10 నుంచి మా ర్చి 31 వరకు డొంకరాయి జలాశయం స్పిల్‌వే గేట్ల ద్వారా 14.468టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు ఆయన వివరించారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్‌లో ఆంధ్రా వాటా 33.1849 టీఎంసీలు, డొంకరాయి, గుంటవాడ (సీలేరు)జలశయాల్లో13.1061టీఎంసీలతో కలిసి మొత్తంగా సీలేరు కాంప్లెక్సుకు 46.2910 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్టు సీఐ వాసుదేవరావు తెలిపారు.

అన్ని కోణాల్లో నాగాంజలి కేసు దర్యాప్తు

కొంతమంది రాజకీయ లబ్ధికి ఈ సంఘటనను వాడుకోవడం సరికాదు : డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యకిషోర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆస్పత్రిలో ఫార్మాలజిస్టుగా పనిచేస్తున్న నల్లపు నాగాంజలి ఆత్మహత్యయత్నం సంఘటనకు సంబంధించి ప్రకాష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు అన్ని కోణాల్లో దర్యాప్తు జరుగుతోందని డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. బుధవారం ప్రకాష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత నెల 24వ తేదీన ఆస్పత్రి డ్యూటీలో ఉన్న నాగాంజలి ఆత్మహత్య యత్నం చేసిందని ఆమె తండ్రి నల్లపు దుర్గారావు ఫిర్యాదు చేయడంతో క్రైమ్ నెంబర్ 54/2025 యూ/ఎస్ 74,79, 351(2), 226 బీ ఎన్ ఎస్ (354, 909, 506, 309 ఐపీసీ) 75,78, 115(2), 64, 108, ఆర్/డబ్ల్యు 56 బీఎస్ఎస్ (354-ఎ, 354-డీ, 323, 376, 306 ఆర్/డబ్ల్యు 116 ఐపీసీ) గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని తెలిపారు. ఈ కేసులో నిందితుడు దువ్వాడ మాధవరావుదీపక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. నాగాంజలి రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా ఈ కేసును రేప్ కేస్‌గా అల్టర్ చేసి సెక్షన్లు మార్పు చేసి ఆస్పత్రి సీసీ ఫుటేజ్ కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అలానే దీపక్‌ను సమగ్ర విచారణ చేసేందుకు పోలీసుకస్టడీకి ఇవ్వమని కోర్టును కోరడం జరిగిందన్నారు. నాగాంజలి ఆరోగ్య విషయం పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ ప్రభుత్వ డాక్టర్ల కమిటీని నియమించారని, ఆ కమిటీ నాగాంజలి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికపుడు పరిశీలిస్తోందని తెలిపారు. ప్రస్తుతం నాగాంజలి వెంటిలేటర్ మీద ఉండటం, వెంటిలేటర్ తీసేసిన ఎడల ఆమె చనిపోవచ్చని వైద్యులు అప్రమత్తంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కేసు దర్యాప్తులో నిష్పక్షపాతంగా ఎటువంటి అనుమానాలకు, అపోహలకు తావు లేకుండా పూర్తి పారదర్శంగా దర్యాప్తు జరుగుతోందన్నారు. అయితే ఈ కేసు విషయంలో కొంతమంది రాజకీయ లబ్ధి కోసం నాగాంజలి ఆత్మాహత్య ఘటనను వాడుకుంటున్నారని, సరైన పద్ధతి కాదని డీఎస్పీ తెలిపారు. ప్రకాష్‌నగర్ సీఐ బాచీలాల్, ఎస్‌ఐ తదితరులు పాల్గొన్నారు.

ఫెర్టిలిటీ సెంటర్‌లో నగదు కాజేసిన దొంగ అరెస్టు

రూ.2,64,000 స్వాధీనం

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం దానవాయిపేట లక్ష్మి ఫెర్టిలిటీ సెంటర్‌లో గత నెల 28న రాత్రి ఓ దొంగ ప్రవేశించి నగదు అపహరించుకుపోయాడు. ఈ మేరకు ఆ సెంటర్ నిర్వాహకుడు గవర సాయిరామకృష్ణ గత నెల 29న స్థానిక 1 టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన 1 టౌన్ సీఐ ఎన్.మురళీకృష్ణ, ఎస్ఐ ఆదినారాయణ తమ సిబ్బందితో దొంగతనం కేసును ఛేదించారు. దొంగతనానికి పాల్పడింది స్థానిక వంకాయలవారి వీధికి చెందిన అక్కబత్తుల గోవిందరాజు అలియాస్ గోవిందును బుధవారం అరెస్టు చేసి అతడి నుంచి రూ2,64,000 నగదు స్వాధీనపరుచుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. దొంగను పట్టుకునేందుకు కృషి చేసిన సీఐ, ఎస్ఐ, హెచ్‌సీ సురేష్, కానిస్టేబుల్ గణేష్, వెంకటేష్‌ను ఎస్పీ నరసింహకిషోర్, డీఎస్పీ రమేష్‌బాబు అభినందించారు.

రేబీస్ సోకిన ఎద్దు మృతి


మృతిచెందిన ఎద్దు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు గ్రామంలో వీధుల్లో తిరుగుతూ పలువురిపై దాడి చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఎద్దు బుధవారం మృతి చెందింది. వివరాల ప్రకారం.. సాధారణంగా దివాన్‌చెరువులో పశువులు యథేచ్ఛగా వీధుల్లో సంచరిస్తూ ఉంటాయి. మంగళవారం ఒక ఎద్దు వింతగా ప్రవరిస్తూ కొంతమందిపై దాడి చేయడంతో ప్రజలు భయాందోళన చెందారు. ఎట్టకేలకు మంగళవారం రాత్రి గ్రామంలో దీనిని ఒకచోట కట్టేశారు. బుధవారం ఈ ఎద్దుకు మత్తు మందు ఇచ్చి దానిని అక్కడి నుంచి తరలించేందుకు పంచాయతీ అధికారులు ప్రయత్నించారు. సీతానగరం నుంచి మత్తు వైద్యులను రప్పించామని దివాన్‌చెరువు పంచాయతీ పశుసంవర్ధక శాఖసహాయకుడు గణేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆ ఎద్దు మృతి చెందిందన్నారు. ఏదైనా పిచ్చి కుక్క కరిస్తే పశువులు మతిస్థిమితం తప్పుతాయని, ఆ తర్వాత 7 నుంచి 14 రోజుల్లో మృతి చెందుతాయన్నారు. ఈ ఎద్దు కూడా రేబీస్ వ్యాధి సోకి మృతి చెందిందని, దీని యజమానులు ఎవరో తెలియలేదన్నారు.

సారా కేసులో మహిళకు రూ.50వేలు జరిమానా

పిఠాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో సారా విక్రయిస్తూ పట్టుబడిన గుత్తుర్తి మునలమ్మను బుధవారం అరెస్టు చేశారు. ఆమెను పిఠాపురం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా రూ.50వేలు జరిమానా విధించినట్టు ఎక్సైజ్ సీఐ శివరామరాజు తెలిపారు. మునలమ్మ నుంచి జరిమానా వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేశామన్నారు.

చందువ చేపల విత్తనోత్పత్తిపై సీఎంఎఫ్ఆర్ఐతో ఎంవోయూ



ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న సీఎంఎఫ్ఆర్ఐ సైంటిస్ట్‌లు, హేచరీ యాజమాన్యం

తొండంగి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చందువ చేపల విత్తనోత్పత్తిపై సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌తో కాకినాడ జిల్లా తొండంగిలోని దానవాయిపేట వైభవ్ హేచరీస్ వ్యాపార ఒప్పందం చేసుకున్నారు. బుధవారం దానవాయిపేటలో జరిగిన కార్యక్రమంలో సీఎంఎఫ్ఆర్ఐ సీనియర్ సైంటిస్ట్ జోకే జోకేకిజహకుడన్, వైభవ్ హేచరీ మేనేజింగ్ డైరెక్టర్ బేటే చంద్రశేఖర్ బేటే సాయి కపిల్ విఖ్యాత్‌లు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. దేశంలోనే మొదటిసారిగా తీరప్రాంత గ్రామాల్లో చందువ చేపల విత్తనోత్పత్తిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసేందుకు ఎంవోయూలు కుదుర్చుకుంటున్నట్టు కిజహకూడన్ తెలిపారు. రొయ్య ఉత్తత్తితోపాటు ఇతర చేపల ఉత్పత్తిని పెంచేందుకు కేంద్రప్రభుత్వం ఇచ్చిన సూచనల ఆధారంగా వాణిజ్య పరంగా చందువా చేపల ఉత్పత్తిని చేపట్టేందుకు సీఎంఎఫ్ఆర్ఐ కృషి చేసిందన్నారు. వైరస్ బ్యాక్టీరియాను తట్టుకునే విధంగా చందువా పిల్లల్ని ఉత్పత్తి చేసి పలు ప్రాంతాల్లో వీటి పెంపకంపై పరిశోధనలు చేయగా పూర్తిగా విజయవంతంపై ఆధారంగా తొండంగి మండలంలో వైభవ్ హేచరీతో ఎంవోయూ కుదుర్చుకుని రైతులకు సీడ్ అందుబాటులో ఉంచామన్నారు. రొయ్యల రైతులు కూడా వీటిని సాగుచేసి అధిక లాభాలు పొందవచ్చన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతుల సందేహాలకు సమాధానాలిచ్చారు. డాక్టర్ బిజిజెవియర్, డాక్టర్ జయశ్రీలోక, డాక్టర్ రీతేష్ రంజన్ డాక్టర్ శేఖర్ మహర్జన్ బేటే సాయి త్రిలోక్, టీడీపీ జిల్లా మత్స్యకారఅధ్యక్షుడు కోడ వెంకటరమణ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ కేసులో రీపోస్టుమార్టానికి ఎన్‌వోసీ ఇవ్వండి

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు మాజీ ఎంపీ హర్ష తనయుడు శ్రీరాజ్ వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న శ్రీరాజ్

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం రేకెత్తించిన పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి ఘటనకు సంబంధించిన కేసులో పాస్టర్ పార్థివదేహానికి ఉస్మానియా వైద్యులతో ప్రైవేటు ఫోరెన్సిక్ ల్యాబరేటరీ పర్యవేక్షణలో రీపోస్టుమార్టం నిర్వహించేందుకు ఎన్‌వోసీ ఇవ్వాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీహర్షకుమార్ తరుపున ఆయన తనయుడు జీవీ శ్రీరాజ్ బుధవారం తూర్పుగోదావరి జిల్లా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసి వినతిపత్రం అందచేశారు. ప్రపంచవ్యాప్తంగా ఈ కేసుపై తెలుగువారిలో ఆసక్తి ఉందని, ఫెయిర్ అండ్ ట్రాన్సపరెంట్ ఇన్వెస్టిగేషన్ జరిగి నిజాన్ని నిగ్గు తేల్చకపోతే రానున్నకాలంలో ఇటువంటి బాధాకరమైన సంఘటనలు ఎన్నో జరుగుతాయని తెలిపారు. ఎన్‌వోసీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు


మహిళ కాలు నుజ్జు నుజ్జు అయిన దృశ్యం

నల్లజర్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల-పోతవరం రోడ్డులో ఉన్న ప్లైఓవర్ క్రింద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు పట్టణం తంగెళ్ళమూడికి చెందిన బత్తుల రమణమ్మ కాలు లారీ చక్రాల క్రింద పడి నుజ్జు నుజ్జు అయ్యింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమణమ్మ తమ కుమార్తె మహాలక్ష్మి స్కూటీపై తంగెళ్ళమూడి నుంచి పసివేదల వెళ్తుండగా నల్లజర్ల ప్లైఓవర్ వద్దకు వచ్చేసరికి పోతవరం నుంచి నల్లజర్ల వైపుకు వచ్చే లారీ వేగంగా వచ్చి వారి స్కూటీని బలంగా ఢీకొంది. మహాలక్ష్మి రోడ్డు వైపుకు పడిపోగా రమణమ్మ ఎడమ కాలు లారీ చక్రల కిందకు పడింది. దీంతొ నుజ్జునుజ్జు అయింది. 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రాంబాబు తెలిపారు.

మహిళ మాయలో పడిన సహకార ఉద్యోగి..

చికిత్స పొందుతూ మృతి

మహిళతో పాటు సహకరించిన ఇద్దరిపై హత్య కేసు నమోదు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలో పీఏసీఎస్ సీఈవోగా పనిచేస్తున్న 60ఏళ్ల సత్తి వెంకటేశ్వరరావుకు ఓ మాయలేడి శారీరక వాంఛ ఎరవేసి మద్యంలో మత్తుబిళ్లలు, గడ్డి మందు కలిపి తాగించిన ఘటనలో కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతిచెందినట్టు అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. కాకినాడ మండల తూరంగి ప్రాంతానికి చెందిన కుమారి (30), ఆమెకు సహకరించిన బండారులంక ఎగ్జిబిషన్ వీధికి చెందిన పి.వెంకటరమణ, ఇందుపల్లికి చెందిన తుక్కు సుబ్రహ్మణ్యంపై తొలుత పట్టణ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సహకార ఉద్యోగి చికిత్స పొందుతూ మృతిచెందడంతో హత్య కేసుగా నమోదు చేసినట్టు తెలిపారు. సహకార ఉద్యోగి మృతదేహానికి గురువారం కాకినాడ జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహిస్తారన్నారు. ఈ కేసులో నిందితులు ముగ్గురిని ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్లాంట్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ...

జారి పడి కార్మికుడు మృతి


మృతిచెందిన నాగబాబు

పెద్దాపురం, సామర్లకోట ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్లాంట్ నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ జారి పడి ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం ఏడీబీ రహదారిలో ఉన్న రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంట్ (ఫేజ్-2)లో బుధవారం జరిగింది. వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలేనికి చెందిన రంగనాథం నాగబాబు (40) స్థానిక రిలయన్స్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పరిశ్రమలో ప్లాంట్ నిర్మాణ పనులు జరిగే సమయంలో అదుపుతప్పి పైనుంచి పడి తీవ్రంగా గాయాలపాలయ్యాడు. యాజమాన్యం స్థానిక ప్రభుతాసుపత్రికి తరలించింది. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పెద్దాపురం ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

తుని రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పల్సర్ ద్విచక్రవాహనంపై ఆగి ఉన్న వ్యక్తిని బొలేరా వ్యాన్ ఢీ కొనడంతో మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తునిలో జరిగింది. పాయకరావుపేట మండలం నామవరం గ్రామానికి చెందిన చందక శివ(19) తునిలో ఓ ప్రైవేట్ ఇంటర్నెట్ సంస్థలో పనిచేస్తున్నాడు. అయితే విధుల్లో భాగంగా బుధవారం ఎస్.అన్నవరం వైపు వెళ్తూ రోడ్డుపై ద్విచక్రవాహనంపై ఆగి ఉండగా అతివే గంగా వచ్చి వ్యాన్ ఢీకొందని స్థానికులు తెలిపారు. శివ అక్కడికక్కడే మృతిచెందగా సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసినట్టు సీఐ గీతా రామకృష్ణ తెలపారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

'డైట్'ల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)ల్లో డిప్యూటేషన్ పద్ధతిలో అధ్యాపక ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్టు కాకినాడ జిల్లా డీఈవో పిల్లి రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి అర్హులైన పాఠశాల సహాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోల నుంచి కోరుతున్నామన్నారు. అర్హత గల సంబంధిత సబ్జెక్టులలో 55శాతం మార్కులు, ఎంఈడీలో 55 శాతం మార్కులు కలిగి స్కూల్ అసిస్టెంట్‌గా కనీసం ఐదేళ్ల అనుభవం కలిగి వారి వయసు 58 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 10వ తేదీలోపు కాకినాడ డీఈవో కార్యాలయంలో సమర్పించాలని రాత పరీక్ష, ఇంట ర్వ్యూ ద్వారా ఈ ఖాళీలను పూరిస్తామన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు https://forms.gle/4unKU4g6moktyp5Q6 లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి హార్డ్ కాపీ ని సంబంధిత అధికారుల ద్వారా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రజల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత బీజేపీ ప్రజా ప్రతినిధులు తీసుకుంటారని ఆ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీలో కూటమి బలంగా ఉన్నా మండలిలో వైసీపీ మెజార్టీ వల్ల కొన్ని ఆటంకాలు ఎదురవుతున్నాయన్నారు. తాజాగా టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి ఐదుగురు సభ్యులు మండలిలో కూటమి ప్రభుత్వం తరపున చేరడంతో బలం పెరిగిందన్నారు. సోము వీర్రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు త్రికరణ శుద్ధితో ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పల్లెల్లో కుళాయిలు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వంలో జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కుళాయి నీరిస్తూ పవన్ కల్యాణ్ పేదల దాహార్తి తీరుస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్సీగా తనను ఎంపిక చేసిన బీజేపీ అధిష్ఠానం, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు వీర్రాజు కృతజ్ఞతలు తెలిపారు.

పంగిడిలో 'తిరుమల' నూతన శాఖ ప్రారంభం


పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తిరుమలరావు

కొవ్వూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల విద్యాసంస్థల నూతన శాఖను కొవ్వూరు మండలం పంగిడిలో ప్రారంబించారు. బుధవారం నూతన శాఖలో చైర్మన్ నున్న తిరుమలరావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిగా తిరుమల విద్యాసంస్థలను రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో స్థాపించామని.. అనంతరం విశాఖపట్నం, భీమవరం, పాయకరావుపేట, తణుకులో ప్రారంభించడం జరిగిందన్నారు. కొవ్వూరు మండలం పంగిడిలో నూతన శాఖను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విలువలతో కూడిన విద్యను అందరికి అందించాలనే సదుద్దేశంతో తిరుమల విద్యాసంస్థలను స్థాపించామన్నారు. కొవ్వూరు, దేవరపల్లి, చాగల్లుల్లోని పూర్వ విద్యార్థులు, తల్లితండ్రులు, శ్రేయోభిలాషుల కోరికమేరకు పంగిడి, కాపవరం జంక్షన్ వద్ద తిరుమల నూతన శాఖను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ క్యాంపస్‌లో ఎల్.కె.జీ నుంచి పదో తరగతి, జూనియర్ ఇంటర్ డేస్కాలర్‌గా ప్రారంభించామన్నారు. కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లి, నిడదవోలు, గోపాలపురం, కొయ్యలగూడెం చుట్టుపక్కల గల అన్ని ప్రాంతాల నుంచి బస్సుసౌకర్యం కలదన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ అవకాశాన్ని తల్లితండ్రులు వినియోగించుకోవాలన్నారు. అడ్మిషన్ల కోసం 8096397777, 8096497777లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి కెఎస్ జవహర్, డా.సాంబశివరావు, తిరుమల డైరెక్టర్ నున్న సరోజినీదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ యు.శ్రీహరి, చాగల్లు, పంగిడి, కొవ్వూరు ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు, తల్లితండ్రులు, తిరుమల సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్సీగా పేరాబత్తుల ప్రమాణ స్వీకారం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖరం ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు తన కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలతో ప్రమాణ స్వీకారం చేయించారు.

హత్య కేసులో తండ్రీకొడుకుల అరెస్ట్

తప్పు ఒప్పుకున్న నిందితులు

నల్లజర్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో గత నెల 31న సోమవారం రాత్రి పేరం శివ (27)ను కత్తులతో దారుణ హత్య చేసిన అతడి బావమరది రేగుల శ్రీరామ్, మామ వెంకన్నలను బుధవారం అరెస్ట్ చేసినట్టు సీఐ రాంబాబు తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే తమ కుతూరుని శివ తిట్టడం, కొట్టడం జరుగుతుందని కోపంతో శివను హత్య చేసినట్టు నిందితులు పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు.

అమలాపురం

చెరువులకు మహర్దశ

మామిడికుదురు,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులకు మహర్దశ కలుగుతుందని సర్పంచ్ అడబాల తాతకాపుఅన్నారు. ఉపాధి హామీ ద్వారా లూటుకుర్రులో అభివృద్ధి చేస్తున్న చెరువు పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు విళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ వైఖరికి మోకాళ్లపై నిరసన

అల్లవరం, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): ఓడలరేవుగ్రామాన్ని దత్తత తీసుకోవాలని ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద 31వరోజు రిలేదీక్షలు కొనసాగించారు. మోకాళ్లపై నిలుచుని నినాదాలుచేస్తూ నిరసన తెలిపారు. కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, పినపోతు రామకృష్ణ, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి తీర్థ, కల్యాణ మహోత్సవాలు ఈనెల 4నుంచి 13 వరకు జరుగుతాయని ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయివెంకన్నలు తెలిపారు. కల్యాణోత్సవాల వివరాలను బుధవారం దేవస్థానం ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈనెల 3న పందిరి రాట ముహూర్తంతో ప్రారంభించి 4వ తేదీ ఉదయం 9.54గంటలకు స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెలను చేయడంతో కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయి. 6న గారపాటివీధిలోని యిండిగుల శ్రీనివాసరావు ఇంటి వద్ద ఎదురు సన్నాహానికి భారీ ఏర్పాట్లు చేశామన్నారు. 7వ తేదీ సోమవారం ఉదయం 8.58గంటలకు శ్రీఅలివేలుమంగతాయారు, బీబీనాంచారిసమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి కల్యాణం యిండిగుల శ్రీనివాసరావు-పద్మావతి దంపతులతో పాటు వారి కుటుంబీకుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సుదర్శనం మురళీకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణం అనంతరం భక్తులందరికీ ముత్యాల తలంబ్రాలు పంపిణీ చేసేవిధంగా చర్యలు చేపట్టామన్నారు. నల్లా హైమావతి, రాజమహేంద్రవరం శ్రీలక్ష్మీశ్రీనివాసా కూచిపూడి నృత్యాలయం, అమలాపురం శ్రీకళాక్షేత్ర విద్యార్థినులతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటుచేశారు. రాత్రి గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుంది. 8వ తేదీ ఉదయం స్వామివారి ఆలయం వద్ద తీర్థం, మధ్యాహ్నం 3.15గంటలకు రథోత్సవం జరుగుతుందన్నారు. 9న పొన్నవాహన గ్రామోత్సవం, 10న సదస్యం, పండిత సత్కారం, శేషవాహనంపై తెప్పోత్సవం, అశ్వగంధర్వ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది. 11న హనుమంత వాహనంపై గ్రామోత్సవం, 12న పూర్ణాహుతి,చక్రస్నానం, 13న తిరుమంజనసేవ, బుక్కా ఉత్సవం, ఉయ్యాల సేవోత్సవం, శ్రీపుష్పోత్సవం నిర్వహించేందుకు దేవాదాయశాఖ తరపున ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. సమావేశంలో కొమ్ముల ఆదినారాయణ, గోకరకొండ లక్ష్మణరావు, గన్నవరపు సూర్యభాస్కరరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ఈవో వెంకటేశ్వరరావు, చైర్మన్ అబ్బాయివెంకన్న



శ్రీవేంకటేశ్వరస్వామి మూలవిరాట్

వేదధర్మాన్ని ఆచరించి హైందవధర్మాన్ని రక్షించాలి

- ఉమామల్లేశ్వరునికి అన్నాభిషేకం, కుంకుమ పూజలు





ఘనాపాఠి రామచంద్రసోమయాజులుశర్మ ప్రవచనాలు

అల్లవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ జగద్గురువు శ్రీశంకరాచార్యులు సూచించిన వేద ధర్మం ఆచరించి, హైందవ ధర్మాన్ని రక్షించాలని ప్రముఖ వేదపారాయణ విద్వాంసుడు, ఘనాపాఠి ఈవని రామచంద్రసోమయాజులుశర్మ అన్నారు. దేవగుప్తం ఉమామల్లేశ్వరస్వామి ఆలయం వద్ద నక్షత్ర పూర్వక నవగ్రహ యాగ మహోత్సవాల సందర్భంగా భక్తులను ఉద్దేశించి బుధవారం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. వేద ఉపనిషత్తులకు భాష్యం చెప్పిన వ్యాసభగవానుల వాక్కు ఆచరణీయమని, శంకరాచార్యులు లోక జనోద్ధరణకు జ్ఞానాన్ని అందించి శక్తిని నిక్షిప్తం చేశారన్నారు. మానవులు దోష రహితులై సేవా గుణంతో సద్గుణవంతులుగా మారాలన్నారు. ఉమా పార్వతీ మల్లేశ్వరునికి మరువాడ వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో పోచినపెద్ది నరసింహమూర్తి బ్రహ్మత్వాన పోచినపెద్ది శ్యామ్‌శర్మ వేదపురోహితుల మంత్రోచ్చారణలతో మల్లేశ్వరునికి అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా జరిపారు. కుంకుమపూజలు, చండీ హోమాలు నిర్వహించారు. ఉమా మల్లేశ్వరాలయంలో జరిగిన హోమాలు, అభిషేక పూజలకు దేవగుప్తం, డి.రావులపాలెం, సామంతకుర్రు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. శివనామస్మరణలు, వేద మంత్రాలతో మల్లేశ్వరాలయ ప్రాంగణం మర్మోగింది.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను డిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. బుధవారం యానాం విద్యాశాఖ ఆధీనంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ ఉత్సవాలను నిర్వహించారు. విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణా ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆయ పాఠశాలల హెచ్‌ఎంల అధ్య క్షతన జరిగిన కార్యక్రమంలో మల్లాడి మాట్లా డారు.యానాం శివారు సావిత్రి నగర్‌లోని సుబ్రహ్మణ్యభారతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గిరియంపేటలోని ఫైరుంతలైవర్ కమరాజర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల, దరియాలతిప్పలోని అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, డాక్టర్ కేఆర్ నారాయణ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పరంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉన్నత పాఠశాల ప్రవేశ ఉత్సవాలను బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం మెడికల్ కళాశాలలో ప్రవేశానికి 10 శాతం రిజర్వేషన్ కల్పించిందని, దానిని 25 శాతానికి పెంచాలని ఇటీవల సీఎంను కోరామన్నారు. మల్లాడి స్వంతంగా రూ.3లక్షలతో సమకూర్చిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులుపాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

మామిడికుదురు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులో బుధవారం సర్పంచ్ గొస్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. అపార్టుమెంట్లు, ఇళ్లు, దుకాణాల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాలను దూర ప్రాంతాలకు తరలించారు. తడి-పొడి చెత్తలను వేరుచేసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలిస్తున్నట్టు కార్యదర్శి పీవీఆర్కే రాజు తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన

పీఆర్సీ బకాయిలు విడుదలచేయాలి



కలెక్టరేట్ పరిపాలనాధికారి కాశీవిశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో జిల్లా నాయకులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో జిల్లాశాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ ఉపాధ్యాయ యూనియన్లకు చెందిన ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై నినాదాలతో హోరెత్తించారు. 12వ పీఆర్సీని తక్షణం ఏర్పాటు చేయడంతో పాటు మధ్యంతర భృతి 30శాతం విడుదల చేయాలని, 11వ పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలని నినాదాలతో హోరెత్తించారు. 2022 జనవరి నుంచి బకాయి పడ్డ ఈఎల్ బిల్లులు విడుదల చేయాలని, విశ్రాంత ఉపాధ్యాయుల రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. మరణించిన ఉపాధ్యాయుల వారసులకు కారుణ నియామకాలు వెంటనే చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు చెల్లింపునకు రోడ్ మ్యాప్ విడుదల చేయాలని కోరారు. ఫ్యాప్టో జిల్లా శాఖ చైర్మన్ ఎంటీవీపీఎస్ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి దొరబాబు ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో కోశాధికారి కె.రామచంద్రం, సెక్రటరీ జనరల్ పీవీఎస్ రామారావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ పెంకే వెంకటేశ్వరరావు, సరిదే సత్యపల్లంరాజు, ఎస్‌ఎన్ మునేశ్వరరావు, కార్యదర్శి షబ్బీర్‌హుస్సేన్, జీవీవీ సత్యనారాయణ, నాగిరెడ్డి శివప్రసాద్, ఎస్.జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావుకు యూనియన్ల ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.

లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలు తగవు

- మండల సమావేశానికి అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం
- ఎస్సీ వర్గీకరణకు నిరసన.. వాకౌట్



అమలాపురం మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి



సమావేశంలో ఎస్సీ వర్గీకరణకు నిరసన తెలుపుతున్న సభ్యులు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలు తగదని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ గృహ నిర్మాణ రుణాలు అందించాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులపై ఉందన్నారు. గృహనిర్మాణశాఖ ఏఈ వినాయకవర్మపై ఎంపీపీతో పాటు సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మండల పరిషత్ సమావేశానికి పలువురు కీలక శాఖల అధికారులు డుమ్మా కొట్టడంపై మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ సభ్యులు నిరసన తెలిపి సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అమలాపురం మండల పరిషత్ సమావేశం బుధవారం ఎంపీపీ భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. తొలుత గృహనిర్మాణశాఖపై సమీక్ష నిర్వహించారు. గృహనిర్మాణ రుణాల కోసం దరఖాస్తులు ఇస్తుంటే ఆ శాఖ అధికారులు తీసుకోవడం లేదని పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆ శాఖ అధికారిని ప్రశ్నించారు. అధికారులు గ్రామంలోకి వచ్చి ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వని అంశంపై చర్చించారు. దరఖాస్తులు ఎందుకు తీసుకోవడంలేదో చెప్పాలని పలువురు సభ్యులు ఏఈ వినాయకవర్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014నుంచి 2024వరకు రూ.1.50లక్షల రుణంతో గృహనిర్మాణం చేపట్టినప్పటికీ పూర్తికాని యెడల అదనంగా ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.70వేలు అదనపు రుణాలు ఇస్తుందన్నారు. అమలాపురం మండలంలో ఎంతమేర గృహనిర్మాణ రుణాలు పెండింగ్‌లో ఉన్నాయో చెప్పాలని గుత్తుల చిరంజీవిరావు, చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు ప్రశ్నించారు.

రూ.3కోట్ల మేర బకాయిలు ఉన్నట్టు సమాధానమిచ్చారు. అధికారులు గ్రామాల్లోకి వచ్చినప్పుడు పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలని చెబుతున్నప్పటికీ ఎందుకు పట్టించుకోవడంలేదని ఎంపీపీ మండిపడ్డారు. విద్యుత్‌శాఖలో పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కంభంపాడు రోడ్డు రాళ్లు పైకి లేచిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయంటూ ఏఈ రాధాకృష్ణ దృష్టికి సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి తీసుకువచ్చారు. ఈరోడ్డు ప్రాజెక్టు పరిధిలోకి వస్తుందని ఏఈ సమాధానమిచ్చారు. సచివాలయాలు, విలేజ్ క్లినిక్ భవనాలు, అసంపూర్తిగా వదిలేశారని ఈదరపల్లి ఎంపీటీసీ అడపా సత్తిబాబు ప్రశ్నించారు. సమావేశంలో కొందరు అనధికార ప్రజాప్రతినిధులు పాల్గొన్నా పట్టించుకోని తీరును కొందరు సభ్యులు ప్రశ్నించారు. మండల పరిషత్ సమావేశం ఎప్పుడు జరిగినా పలువురు మండలస్థాయి అధికారులు గైర్హాజరవుతున్నారని, అయినా ఎందుకు పట్టించుకోవడంలేదని పలువురు సభ్యులు ప్రశ్నించారు. కీలకమైన విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, ఉద్యాన, ఎక్సైజ్‌శాఖ అధికారులతో పాటు పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. కొద్దిసేపు సమావేశం జరిగిన అనంతరం ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ప్రజాప్రతినిధులు ప్లకార్డులు చేతబూని సమావేశంలోనే నిరసన వ్యక్తం చేశారు. అన్యాయంగా తప్పుడు లెక్కలతో వర్గీకరణ చేశారని ఆరోపిస్తూ మండల సమావేశం నుంచి వాకౌట్ చేయగా మిగిలిన ప్రజాప్రతినిధులు వారి వెంట నడిచారు. సమావేశంలో ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పొలమూరి బాలకృష్ణ, అడపా సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు నక్కా అరుణకుమారి, పెనుమాల సునీత, రేలంగి దుర్గారావు, ఎంపీటీసీలు గంగుమళ్ల ఏసుబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, మెండు గంగాభవానీ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

2025 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయాలి

మాల ప్రముఖుల సమావేశం



అమలాపురం బుద్ధవిహార్‌లో సమావేశమైన మాలమహానాడు జిల్లా నాయకులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధంగా నిర్వహించారని, వర్గీకరణ అంశంలో వన్‌మెన్ కమిషన్ వేసిన కాకి లెక్కలను ఆధారంగా చూపడం అన్యాయమని దళిత ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ జంగా బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు ఆరోపించారు. 2011జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మాలల పట్ల చిత్తశుద్ధి ఉంటే 59 ఉప కులాల్లో 2025 జనాభా లెక్కలువేసి వర్గీకరణ చేయాలని అభిప్రాయపడ్డారు. అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో బుధవారం డీబీ లోక్ అధ్యక్షతన కోనసీమ జిల్లాలోని 22మండలాలకు చెందిన మాల ప్రముఖుల సమావేశం నిర్వహించారు. ఎన్డీఏ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా జిల్లాల వారీగా వర్గీకరణ చేస్తామన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడేమో రాష్ట్రాన్ని యూనిట్‌గా చేసుకుని వర్గీకరణ చేయడం అన్యాయమన్నారు. ఎస్సీ వర్గీకరణపై చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నాయకులు తీవ్రంగా దుయ్యబట్టారు. ఇప్పటికే లక్షలాది మంది మాల యువకులు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలతో వర్గీకరణ అంశంపై ముందుకు సాగేందుకు సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. సమావేశంలో నాయకులు రేవు తిరుపతిరావు, గెడ్డం సురేష్‌బాబు, గొల్లపల్లి డేవిడ్‌రాజు, పెనుమాల చిట్టిబాబు, సాపే బాలరవి, కప్పల శ్రీధర్, ములపర్తి సత్యనారాయణ, బడుగు జేమ్స్‌పాల్, నందిక శ్రీనివాస్, పెయ్యల శ్రీనివాస్, నక్కా సంపత్‌కుమార్, మెండు రమేష్, ఉండ్రు వెంకటేష్, గూటం సాయి, పినిపే జయరాజ్, కాశి రాంబోధి, నక్కా చంద్రశేఖర్, ఉబ్బన శ్రీను, మాకే సిద్ధు, కాకర శ్రీను, కోట రామ్మోహనరావు, కాశి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

అల్లవరం, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో బీఎస్‌ఎస్ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. బ్యాంకుల ద్వారా అర్హులకు బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. ఈనెల11 నుంచి ఎస్సీ కార్పొరేషన్ రుణాలకుఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏవో బి.లక్ష్మణరావు, పీఆర్‌ఏఈ ఫకీర్, ఈవోపీఆర్డీ యు.నాగేంద్ర, ఏపీవో పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్‌వోలో చైతన్య విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులకు బహుమతులు

మామిడికుదురు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన ఐఎన్‌టీఎస్‌వో ప్రతిభ పోటీ పరీక్షల్లో మొగలికుదురు శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ సుధాలక్ష్మి తెలియచేశారు. విద్యార్థులు ఆర్.హర్ష ల్యాప్‌టాప్‌ను ప్రథమ బహుమతి, వై.విశ్వంత్ ట్యాబ్‌ను, పలువురు విద్యార్థులు 356 ప్రైజ్‌లను, బంగారు రజత పతకాలను గెలుసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్రీకాంత్, అకడమిక్ డీన్ రమేష్, సీ బ్యాచ్ ఇన్‌చార్జి కె.శ్రీనివాస్ ఉన్నారు.

జగన్‌ను కలిసిన ఎంపీపీ సత్యవతి



కాట్రేనికోన, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన ఎంపీపీ కోలాటి సత్యవతి, ఆమె భర్త సత్యం బుధవారం మాజీ సీఎం జగన్‌ను కలిశారు. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ ఎంపీపీ దంపతులను జగన్‌కు పరిచయం చేశారు. వీరితో పాటు జడ్పీటీసీ నేల కిశోర్‌కుమార్, ఎంపీటీసీలు జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రజాదర్బారులో వినతులు స్వీకరించిన అముడా చైర్మన్



టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో అర్జీదారుల సమస్యవింటున్న అముడా చైర్మన్ స్వామినాయుడు, ఎమ్మెల్సీ రాజా

అమలాపురం టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజా దర్బారులో అమలాపురం పట్టణానికి చెందిన అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు పాల్గొని రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన పలువురు అర్జీదారుల సమస్యలు విని వినతిపత్రాలను స్వీకరించారు. ప్రతీ బుధవారం రాష్ట్ర కార్యాలయంలో ప్రజాదర్బారు నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజాతో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని స్వామినాయుడు తెలిపారు.

కార్పొరేషన్ రుణాలకు 1,544 దరఖాస్తులు

మలికిపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ రుణాల కోసం 1544 దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీడీవో జి.మల్లికార్జునరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు 484, కాపు కార్పొరేషన్ రుణాలకు 1060మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. వివిధ బ్యాంకుల మేనేజర్లు వారి సర్వీసు ఏరియాకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు వందలాదిగా అభ్యర్థులు రావడంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎస్‌ఐ పి.సురేష్ బందోబస్తు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది దరఖాస్తులను తనిఖీచేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు, మండల పరిషత్ ఏవో మిల్టన్, సీనియర్ కార్యదర్శులు అబ్బాస్, సుభాకర్ బాబు, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తిలో పనిచేయడం ఆదర్శనీయం

అల్లవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బాధ్యతగా పనిచేసి అందరి గుర్తింపు పొందడంతో పాటు పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో పనిచేయడం ఆదర్శనీయమని పలువురు వక్తలు ప్రసంగించారు. గోడిలంక జడ్పీ హైస్కూలులో సోషల్ ఉపాధ్యాయురాలిగా పనిచేసి పదవీ విరమణచేసిన ఎం.విజయకుమారిని ఘనంగా సన్మానించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయురాలు నూర్జహాన్‌బేగంతో పాటు పలువురు విజయకుమారి సేవలను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రుద్రరాజు పవిత్రాలక్ష్మీపతిరాజు, వైఎస్ ఎంపీపీ వడ్డి గంగ, రుద్రరాజు రవికుమార్, ఎస్టీయూ ప్రముఖులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్యపల్లంరాజు, నాగిరెడ్డి శివప్రసాద్, చొప్పల రాంబాబు, బోనం గంగాధర్, మోసుగంటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ కార్పొరేషన్ యూనిట్లకు ఇంటర్వ్యూలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అమలాపురం పురపాలక సంఘ పరిధిలో బీసీ కార్పొరేషన్ అందించే వివిధ యూనిట్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికకై గురువారం ఉదయం 11గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. బీసీ జాబితాలోని అన్ని సామాజికవర్గాల వారితో పాటు కాపు, తెలగ, బలిజ, ఒంటరి కార్పొరేషన్లకు చెందిన వారు వివిధ యూనిట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. పట్టణంలోని 15వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులను స్వీకరించగా మున్సిపల్ కమిషనర్, బ్యాంకు బ్రాంచి మేనేజర్లు, కార్పొరేషన్ అధికారుల సమక్షంలో పురపాలక సంఘ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

అయినవిల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీసీ, కాపు, ఈడబ్ల్యుఎస్, టైలరింగ్‌కు సంబంధించి రుణాలకు బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నేదునూరు, ఎన్.పెదపాలెం, నల్లచెరువు, క్రాప, శంకరాయగూడెం, మాగాం, పోతుకుర్రు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 777మంది లబ్ధిదారులకు 38మంది ఇంటర్వ్యూకు హాజరైనట్టు ఎంపీడీవో జి.భీమారావు తెలిపారు. 3న అయినవిల్లి, అయినవిల్లిలంక, చింతనలంక, కె.జగన్నాథపురం, కొండుకుదురు, మడుపల్లి, పొట్టిలంక, ఎస్.మూలపొలం, శానపల్లిలంక, సిరిపల్లి, తొత్తరమూడి, వీరవల్లిపాలెం, వెలువలపల్లి, విలస గ్రామాల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో భీమారావు తెలిపారు.

కార్పొరేషన్ రుణాలకు 1158 దరఖాస్తులు

పి.గన్నవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 10గ్రామాలకు కాపు కార్పొరేషన్ రుణాలకు 601, బీసీ రుణాలకు 553, ఈబీసీ రుణాలకు 4దరఖాస్తులు వచ్చాయని, లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు ఎంపీడీవో కేవీ ప్రసాద్ తెలిపారు. మండల వ్యాప్తంగా కాపు కార్పొరేషన్‌కు 35, బీసీ కార్పొరేషన్‌కు 72యూనిట్లు మంజూరయ్యాయన్నారు. గురువారం మరో పది గ్రామాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

టీడీపీ సభ్యత్వ ఇన్సూరెన్సు కార్డుల పంపిణీ

అమలాపురం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం పొందిన సభ్యులకు ఇన్సూరెన్సు కార్డులను శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. బండారులంక వీరభద్రపురం ప్రాంతంలో ఇన్సూరెన్సు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రోత్సాహంతో గ్రామకమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్ పర్యవేక్షణలో అత్యధికంగా సభ్యత్వ నమోదులు చేయడంతో పార్టీ అధిష్టానం సైతం మెచ్చుకుందన్నారు. బూత్‌కమిటీ అధ్యక్షుడు గుమ్మడి బ్రహ్మాజీ, ప్రొఫెషనల్ వింగ్‌కు చెందిన ఏకుల విజయ్ పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు చేయూత ఇవ్వాలి

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులకు ప్రభుత్వం చేయూతనివ్వాలని కార్మిక అసోసియేషన్ల నాయకులు అభ్యర్థించారు. వాడపర్రులో బుధవారం శ్రీభీమేశ్వర లైటింగ్ అండ్ సౌండ్ సిస్టమ్, టెంట్ హౌస్, జనరేటర్ ఓనర్స్ అసోసియేషన్ల సంయుక్త సమావేశం జరిగింది. కార్మికులకు రాయితీతో రుణాలిచ్చి ఆదుకోవాలని కోరారు. చప్పిడి దుర్గారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రాన్స్ కో లైన్ ఇన్‌స్పెక్టర్ వంగా వెంకట లవకుమార్, లైన్‌మెన్ భారతి వెంకటేశ్వరరావు, జేఎల్ఎం విజయ్‌లను సత్కరించారు. వివిధ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు 60 అర్జీలు



క్యాంపు కార్యాలయంలో అర్జీదారుల సమస్య వింటున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై 60అర్జీలను ఆయనకు అందించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చినవారు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎమ్మెల్యే ఆనందరావుకు పలు సమస్యలపై అర్జీలను అందించగా ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అర్జీదారులకు భరోసా కల్పించారు.

సైన్సు ఉపాధ్యాయుడికి సన్మానం

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు ముత్యాల నరసింహమూర్తిని ఉద్యోగ విరమణ సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థులు బుధవారం ఘనంగా సత్కరించారు. పీఎంసీ చైర్మన్ గుర్లింక చిన్నా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వచ్చిన జనసేన నాయకుడు కల్వకొలను తాతాజీ నరసింహమూర్తి దంపతులను నూతన వస్త్రాలతో సన్మానించారు. హెచ్‌ఎం నూకల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజకుమార్, ఎంపీటీసీలు దేశంశెట్టి నాగరత్నకుమారి, నాగులపల్లి శేషవేణి, ఎంఈవో సత్తి సత్యకృష్ణ, యేడిద శ్రీను, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్లకు ఇంటర్వ్యూలు

రాజోలు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల3,4 తేదీల్లో బీసీ కార్పొరేషన్ 2024-25 బీసీ, కాపు, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా బ్యాంకు రుణాలకు దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు ఉదయం 10గంటల నుంచి 5గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో డి.రాంబాబు బుధవారం తెలిపారు. ఈనెల3న తాటిపాక, పొదలాడ, సోంపల్లి, పాలగుమ్మి, శివకోడు, చింతలపల్లి, కాట్రేనిపాడు, మెరకపాలెం, 4నరాజోలు, పొన్నమండ, కూనవరం, బి.సావరం, వేగివారిపాలెం, కడలి, ములికిపల్లిగ్రామాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

తువ్వ మట్టిలారీ స్వాధీనం

పి.గన్నవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కందాలపాలెంలో బిల్లులు లేకుండా తువ్వమట్టిని తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్టు తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. మానేపల్లి శివారు శివాయిలంకలో ర్యాంపును బుధవారం పరిశీలించేందుకు వెళ్లుండగా మార్గమధ్యలో తువ్వమట్టి లారీని అడ్డుకుని తనిఖీలు చేశామని, బిల్లులు లేకపోవడంతో లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. తహశీల్దార్ రాకవిషయం తెలియడంతో అనుమతులున్న ర్యాంపులోకి లారీలను మళ్లించినట్లు తెలిసింది.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పి.గన్నవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా 33 కేవీ లైన్‌లో పోల్స్, కండక్టర్ మార్పు చేసేందుకు గురువారం ఉదయం 10నుంచి 4గంటలు వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు అమలాపురం ఏఈ కె.రాంబాబు తెలిపారు. పి.గన్నవరం, బొడపాటి వారిపాలెం, లంకలగన్నవరం, మొండెపులంక, నాగుల్లంక, కందాలపాలెం, మానేపల్లి, వాడ్రేవుపల్లి, కనకాయలంక, పుచ్చల్లంక గ్రామాలకు సరఫరా ఉండదని ఆపరేషన్ ఏఈ జీవీ ఆచార్యులు తెలిపారు.

సాధారణ ప్రసవంతో తల్లి, బిడ్డ క్షేమం

పి.గన్నవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తల్లికి సాధారణ ప్రసవంతో బిడ్డతో పాటు తల్లి కూడా క్షేమంగా ఉంటారని గైనకాలజిస్ట్ డాక్టర్ ఎల్.శిరీష అన్నారు. స్థానిక సీహెచ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మొదటి ప్రసవం సాధారణంగా జరిగితే రెండో ప్రసవం కూడా సాధారణంగా జరిగే అవకాశం ఉందన్నారు. తల్లికి రొమ్ము కేన్సర్ వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని, బరువు కూడా సమానంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ వైద్యులు, గర్భిణులు పాల్గొన్నారు.

మురుగుకాల్వలో స్నానానికి దిగి వ్యక్తి మృతి

మామిడికుదురు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆదుర్రులోని కొమరాడలంకకు చెందిన బిరుదుగంటి నాగేశ్వరరావు(64) మురుగుకాల్వలోకి దిగి మృత్యువాత పడ్డాడు. స్నానానికి మురుగుకాల్వలోకి దిగి తన తండ్రి మృతిచెందాడని కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చైతన్యకుమార్ తెలిపారు.

విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు

అంబాజీపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయని జిల్లా సీఎంవో బొరుసు వీరవెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. గంగలకుర్రు అగ్రహారం హైస్కూల్ అసిస్టెంట్ బి.శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సందర్భంగా హెచ్‌ఎం జి.రాజశేఖర్ అధ్యక్షతన సన్మాన సభ జరిగింది. శ్రీనివాస్ దంపతులను పూలమాలలో సత్కరించారు. రూ.10వేలు విలువైన కంప్యూటర్ సామగ్రిని బహూకరించారు. సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ తొత్తరమూడి గోవింద్, నాయకులు ఎం.ఎం.శెట్టి, విత్తనాల శేఖర్, రాయుడు షణ్ముఖ్, బందన రాంబాబు, కట్టా సుబ్రహ్మణ్యం, ముషిణి సత్యనారాయణ, యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

ఎన్ఆర్‌హెచ్‌ఎం ఉద్యోగులకు మద్దతు

యానాం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): యానాంలో కొన్నిరోజులుగాడిమాండ్లతో ఆందోళన చేస్తున్న ఎన్ఆర్‌హెచ్‌ఎం ఉద్యోగులకు యానాం కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు అర్థాని దినేష్ మద్దతు పలికారు. జాతీయ గ్రామీణ ఆరోగ్యమిషన్‌లో పనిచేస్తోన్న సిబ్బందిని పర్మినెంట్ చేయాల న్నారు. నాయకులు అర్థాని దినేష్, రాజబాబు, గణేష్, చెక్కల అరుణ్‌కుమార్, శ్రీను పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఐ.పోలవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మురమళ్లలో కోటి రూపాయలతో నూతనంగా నిర్మించిన శ్రీహనుమత్సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. సుప్రసిద్ధ విగ్రహ ప్రతిష్ఠాచార్య సుదర్శనం వెంకట జనార్ధనాచార్యుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నాయి. బుధవారం నడింపల్లి చినవెంకట్రాజు, వెంకటసత్యసౌజన్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల3న స్వామివారి విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 4న విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం జరగనుంది.

ఘనంగా గంగాభవాని సంబరం

ఆత్రేయపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అంకంపాలెం శివారు పాటిచెరువు గ్రామదేవత గంగాభవాని అమ్మవారి సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి సంబరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. గ్రామపెద్దలు, భక్తులు ఈ సంబరంలో పాల్గొన్నారు.

మండపేట

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కె.గంగవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఎన్.శ్రీనివాసు తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలని ఆయన కోరారు.

వెంకన్న ఆదాయం రూ.2.35లక్షలు



ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,35,389 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

పెందుర్తి ఎమ్మెల్యే పూజలు : విశాఖ జిల్లా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత స్వామివారికి అష్టోత్తర పూజలు జరిపారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకుని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రావులపాలెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి త్వరిత గతిన కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీటిని ఆయా శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

అవగాహనతో ఆటిజం నివారణ సాధ్యం



భవిత కేంద్రంలో ఆటిజం తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం భవిత సెంటర్‌లో బుధవారం ఆటిజం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని తల్లిదండ్రులకు దానిపై అవగాహన కల్పించారు. భవిత ఐఈఆర్టీలు తిరగట్టి వీరవేణి, పోడూరి ఆదర్స్ పలు అంశాలపై మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులకు వక్తలు తెలిపారు. అవగాహనతోనే ఆటిజం నివారణ సాధ్యమౌతుందన్నారు. కార్యక్రమంలో మొయిన్ స్కూల్ హెచ్ఎం ఎం.లక్ష్మీ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాళ్లకూరికి తిరుపతి వేదిక్ యూనివర్సిటీ ప్రశంసాపత్రం

ఆలమూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆలమూరు విక్రమభట్టీశ్వరస్వామి ఆలయం ప్రధాన అర్చకుడు కాళ్లకూరి సూరిపండుకి తిరుపతి వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ శైవాగమ ప్రసంశపత్రాన్ని బుధవారం అందించారు. వేదిక్ యూనివర్సిటీ అధ్వర్యంలో శైవాగమ, వైఖానస, పాంచరాత్ర ఆగమశాస్త్ర విభాగాల్లో 21 రోజులపాటు ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. తరగతుల అనంతరం పరీక్షలు జరిపి ఉత్తీర్ణత సాధించిన వారికి ధృవీకరణ పత్రాలు, ప్రసంశపత్రాలు అందించారు. శైవాగమ విభాగంలో ఉత్తీర్ణత సాధించిన కాళ్లకూరి సూరిపండుకు ప్రశంసాపత్రం, గుర్తింపు పత్రాలను అందించారు.



తిరుపతిలో ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న కాళ్లకూరి

తిరుపతి యూనివర్సిటీ నుంచి శైవాగమ ప్రసంశాపత్రం స్వీకరించిన ఆయన్ను పలువురు నాయకులు, వ్యాపారవేత్తలు, భజన మండలి సభ్యులు అభినందించారు.

పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ ప్రారంభం



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆలమూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు ఆలమూరులో ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభించారు. బీసీ, మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం అధ్వర్యంలో ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 15 సంవత్సరాలుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం శిక్షణ తరగతులు మొదలు పెట్టారు. శిక్షణతోపాటు ఉచిత మెటీరియల్స్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. ప్రారంభోత్సవంలో ఉద్యోగుల సంఘాల నాయకులు బొంతు లోకేష్, వెంకటేశ్వరరావు, వాసా దుర్గాప్రసాద్, ప్రసాద్, వైవీ.రమణ, వాకా గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రమాణ స్వీకారానికి వెళుతున్న బీజేపీ నేతలు

ఎమ్మెల్సీ సోము ప్రమాణ స్వీకారానికి బీజేపీ నేతల పయనం

రావులపాలెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల ఎమ్మెల్సీగా సోము వీర్రాజును ప్రకటించడంతో ఆయన ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు గొనిమడతల కనకరాజు ఆధ్వర్యంలో తరలివెళ్లారు. కొత్తపేట నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు, కో కన్వీనర్ గండ్రోతు వీరగోవిందరావు, పొనుగుపాటి శ్రీనివాసు, పసుపులేటి మహాలక్ష్మిరావు తదితరులు తరలివెళ్లారు.

శెట్టిబలిజ సంఘం మండల అధ్యక్షుడిగా గోవిందు ఎన్నిక

మండపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) పట్టణ శెట్టిబలిజ సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపంలో జరిగింది. కార్యవర్గ అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ బండి గోవిందు, ఉపాధ్యక్షుడిగా పెంకే వెంకట్రావు, కార్యదర్శిగా కుక్కల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా పంపన శ్రీనివాస్, జాయింట్ కార్యదర్శిగా కడలి నాగదుర్గారావు, ట్రెజరర్‌గా కె. శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. పట్టణంలో వున్న పది శెట్టిబలిజ సంఘాలకు చెందిన పెద్దలు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సంఘీయులు సత్కరించారు. మాజీ సంఘ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్‌ను సంఘీయులు సత్కరించారు. కార్యక్రమంలో మండపేట ఎంఎసీ నూతన ఛైర్మన్ సి.రామకృష్ణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పి. గణేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్ పి.శ్రీనువాస్, మాజీ కౌన్సిలర్‌లు, జి.గోవిందు, సి.గోవిందు, ఎన్.చంద్రరావు, శెట్టిబలిజ సంఘ నాయకులు ఎం. గోవిందరాజు, పి. గంగాధరం, ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పట్టణ శెట్టిబలిజ నూతన కార్యవర్గం సభ్యులు

రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభాలు

• తరచూ ప్రమాదాలతో ప్రజల్లో భయాందోళనలు • చోద్యం చూస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు



ఆత్రేయపురం మండలం రాజవరంలో రోడ్డు మధ్యలోనున్న విద్యుత్ స్తంభం

ఆత్రేయపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రోడ్ల మధ్యలో విద్యుత్ స్తంభాలు తొలగించకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారుల సమన్వయ లోపం కారణంగా వాటి వల్ల పలువురు ప్రమాదాలబారినపడిన సంఘటనలు ఉన్నాయి. ఆత్రేయపురం మండలం రాజవరం, మెర్లపాలెం, ర్యాలీ గ్రామాల ముఖ్య కూడలిలో ఆర్అండ్‌బీ రోడ్ల మధ్యలో ఇవి ఉండిపోవడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రజలు ఈ విషయాన్ని చెప్పినా అధికారులు పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ వాహనాల రద్దీతో పాటు ప్రైవేట్ పాఠశాలల బస్సుల రాకపోకలతో ఆ ప్రాంతాలు రద్దీగా ఉంటున్నాయి. ర్యాలీ హైస్కూల్ సెంటర్‌లోని ఆర్అండ్‌బీ మూడు రోడ్ల సెంటర్‌లో రహదారిని వెడల్పు చేశారు. ఈ రహదారిపై ప్రతి రోజూ ట్రాఫిక్ ఉంటుంది. దీంతో రోడ్ల మధ్యలో కరెంట్ స్తంభం ఉండటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ రహదారి మీదుగా అనేక మంది విద్యార్థులు హైస్కూల్‌కు వెళుతుంటారు. మెర్లపాలెం పంచాయతీ నుంచి కొత్త వంతెన వరకు రోడ్డును ఆధునికీకరించారు. మూడు మీటర్ల రోడ్డును 5 మీటర్లుగా వెడల్పు చేయడంతో విద్యుత్ స్తంభాన్ని రోడ్డు మధ్యలోనే ఉంచేశారు. దాన్ని మార్చేందుకు సంబంధిత కాంట్రాక్టర్ విద్యుత్‌శాఖ అధికారులకు డిమాండ్ డ్రాఫ్టు ఇచ్చినప్పటికీ మార్చలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాజవరం వేణుగోపాల స్వామి గుడి నుంచి కాలువ రేవు వరకు ఆరుమీటర్ల సిమెంట్ రోడ్డును వెడల్పు చేశారు. విద్యుత్ స్తంభం రోడ్డు మధ్యలో ఉండిపోవడంతో స్కూల్ బస్సులు తిరిగే సమయంలో స్తంభం అడ్డు వస్తోంది. రోడ్లను ఆధునికీకరించే సమయంలోనే పంచాయతీ, విద్యుత్‌శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తే కరెంట్ స్తంభాల సమస్య పరిష్కారం అవుతాయని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.



ర్యాలీ హైస్కూల్ జంక్షన్‌లోని మూడు రోడ్ల కూడలి మధ్యలోనున్న కరెంట్ స్తంభం



ఎమ్మెల్సీ పేరాబత్తులను అభినందిస్తున్న మంత్రి సుభాష్

ఎమ్మెల్సీలు పేరాబత్తుల, ఆలపాటిలను అభినందించిన మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీలుగా బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన పేరాబత్తుల రాజశేఖర్, ఆలపాటి రాజాలను మంత్రి సుభాష్ అభినందించారు. ప్రమాణ స్వీకారం చేసిన రాజశేఖర్‌కు మంత్రి పుష్పగుచ్చం అందచేసి అభినందనలు తెలిపారు. కృష్ణా, గుంటూరు గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజాను మంత్రి అభినందించారు.

రైతులకు ప్రభుత్వం అండ

రావులపాలెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద రాయితీపై వచ్చిన కిషి ట్రాక్టర్లను రైతులకు అందచేశారు. రైతులకు ఆర్థిక పురోభివృద్ధి కల్పించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు.



లొల్ల మురుగుకాలువలో గుర్రపుడెక్క తొలగిస్తున్న దృశ్యం

మురుగుకాలువలో గుర్రపుడెక్క తొలగింపు

ఆత్రేయపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వాడపల్లి- లొల్ల పరిధిలోని మురుగుడ్రెయిన్ గుర్రపుడెక్కతో మూసుకు పోయింది. తుప్పలు పెరిగిపోయి మురుగునీరు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో దేవస్థానం ఆధ్వరంలో రెండు రోజుల నుంచి మురుగు డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడును జేసీబీతో తొలగింపు చర్యలు చేపట్టారు. మురుగు డ్రెయిన్ శుభ్రం చేయడంతో నీటి ప్రవాహం ముందుకు సాగుతోందని తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నవదోయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో పేరవరంలో సీఐ కాత్యాయని ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కోట సత్తెమ్మ అనే మహిళ వద్ద నుంచి 20 లీటర్ల సారాతో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కె.అన్నవరం తెలిపారు.



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అన్నపూర్ణ

సాధారణ ప్రసవంతో తల్లీ, బిడ్డ క్షేమం

కొత్తపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రసవంతో తల్లీ, బిడ్డ క్షేమంగా ఉంటారని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవంతో కలిగే ప్రయోజనాలపై సదస్సు నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ సాధారణ ప్రసవం వల్ల ఖర్చు తక్కువతో పాటు తల్లి, శిశుమరణాల రేటు తగ్గుతుందన్నారు. సాధారణ ప్రసవాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వంశి, డాక్టర్ అన్నపూర్ణ, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ, గ్రామ సచివాలయాల్లో ఆర్డీవో తనిఖీలు

ద్రాక్షారామ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిబద్ధతతో పాటు, పారదర్శకంగా సేవలు అందించాలని రామచంద్రపురం ఆర్డీవో అఖిల సచివాలయ ఉద్యోగులకు సూచించారు. బుధవారం ద్రాక్షారామ-2 సచివాలయాన్ని ఆర్డీవో తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది హాజరు పట్టి, రికార్డుల నిర్వహణను ఆమె పరిశీలించారు. సేవలు అందుతున్న తీరుపై లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు తనిఖీ చేశారు. అవుట్ పేషెంట్ల రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రసూతి విభాగంలో నెలవారీ కాన్పుల నిర్వహణ రికార్డులు పరిశీలించారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో కె.పద్మజ్యోతి, ఈవో పీఆర్‌డీ షెలట్‌రాజు, సర్పంచ్ కొత్తపల్లి అరుణ పాల్గొన్నారు.



ద్రాక్షారామ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల

రావులపాలెంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం

అధికారులతో ఎమ్మెల్యే బండారు సమీక్ష



ట్రాఫిక్ సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం రావులపాలెంలో హైవే, ఆర్అండ్‌బీ, పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కోనసీమ ముఖద్వారం, రింగ్ రోడ్డు, కళా వెంకట్రావు సెంటర్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అనంతరం రావులపాలెం మండల పరిషత్ మీటింగ్ హాలులో ట్రాఫిక్ నియంత్రణకు శాశ్వత పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కోనసీమ ముఖద్వారం కళా వెంకట్రావు సెంటర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పరిష్కారాలను సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రతి శనివారం వాడపల్లి ఆలయానికి వెళ్లే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం డీఎస్పీ సుంకర మురళీమోహన్, వీడీ సురేంద్రనాద్ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో విక్టరీ వెంకటరెడ్డి, చిలువూరి సతీష్‌రాజు, గుత్తుల రాంబాబు, జక్కంపూడి వెంకటస్వామి, ఎంపీడీవో మహేష్, తహశీల్దారు ముక్తేశ్వరరావు, ఆర్అండ్‌బీ డీఈఈ రాజేంద్ర, సీఐలు ఎం.శేఖర్‌బాబు, సీహెచ్ విద్యాసాగర్, సెక్రటరీ ఎల్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణకు ప్రత్యేక పరీక్షలు

మండపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధా కుమారి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో బుధవారం క్షయవ్యాధి నిర్ధారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షల్లో భాగంగా చర్మవ్యాధి పరీక్షలు చేశారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరా రు. కార్యక్రమంలో టీబీ వైద్యులు, డాక్టర్‌లు లావణ్య, సతీష్, టీబీ సూపర్‌వైజర్ కెఎస్‌వీ రమణ, స్టాఫ్‌నర్సు మాధురి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మండపేట ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

విజ్ఞాన భారతి సేవలు అభినందనీయం

కె.గంగవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న విజ్ఞానభారతి పాఠశాలల సేవలు అభినందనీయం అని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. కోటిపల్లిలో భారతీయ విద్యా కేంద్రము వారి విజ్ఞాన భారతి పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కూటమి నేతలు వాసంశెట్టి సత్యం, కర్రి చిట్టిబాబు, అవసరాల రమణమూర్తి తదితరులు పాల్గొని విజ్ఞాన భారతి పాఠశాల సాధించిన విజయాలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ, చీకట్ల రాము, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

ఇద్దరు బాధితులకు మంత్రి సుభాష్ ఆర్థికసాయం



ఆర్థికసాయం అందచేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భవనంపై నుండి పడి గాయపడిన భవన నిర్మాణ కార్మికుడు కొత్తూరు గ్రామానికి చెందిన అలసాని ప్రసాద్‌కు మంత్రి సుభాష్ ఆర్థికసాయం అందచేశారు. భవనం పైనుంచి బాధితుడు పడిపోవడంతో వెన్నెముక దెబ్బతిని నడవలేని పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. పార్టీనాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి టిడ్కో గృహానికి వెళ్లి ఆర్థికసాయం అందచేశారు. రూ 15 వేలు పింఛను మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గుబ్బలవారిపేటకు చెందిన గుబ్బల గోపి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతనికి రూ.5 వేలు ఆర్థికసాయం అందచేశారు. మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి పంపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమినాయకులు గరిగిపాటి సూర్యనారాయణమూర్తి ఉన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ద్రాక్షారామ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం మండలం అన్నాయిపేటకు కంచర్ల వరలక్ష్మీ(53) అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. అన్నాయిపేటకు చెందిన వీరలక్ష్మీ ఈనెల 1న ఇంటి నుండి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐ 944409 04850లో తెలియచేయాలని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురికి జరిమానా

మండపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం సేవించి పట్టుపడిన ముగ్గురికి ఆలమూరు మున్సిఫ్ కోర్టు జడ్జి జరిమాన విధించారని పట్టణ సీఐ సురేష్ తెలిపారు. కపిలేశ్వరపురం మండలం వడ్లమూరుకు చెందిన ఇల్లూరి రాజబాబు, మండపేటకు చెందిన ఉప్పలపు సింహాచలం, సందాల సాయి కుమార్‌లకు ఆలమూరు మున్సిఫ్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి ఐ.ప్రవీణ్‌కుమార్ ఒక్కొకరికి రూ.10,500 వంతున జరిమాన విధించారని సీఐ తెలిపారు.



పోలీస్ సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న డీఎస్పీ మురళీమోహన్

రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి
డీఎస్పీ మురళీమోహన్

రావులపాలెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. రావులపాలెం రూరల్ సీఐ కార్యాలయంలో బుధవారం సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఆలమూరు, ఆత్రేయపురం, కొత్తపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేశారు. అనంతరం ఇటీవల ఆలమూరులో అదృశ్యమైన ఆరుగురు విద్యార్థులను సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందచేశారు.

మండలంలో 87 శాతం ఇంటి పన్నులు వసూళ్లు

రాయవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో 87 శాతం ఇంటి పన్నులు వసూళ్లు చేసినట్లు ఈవోపీఆర్డీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 2కోట్ల 30 లక్షల 99వేల 42 రూపాయలు ఇంటి పన్నులు వసూళ్లు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 2కోట్ల 56వేల 67 రూపాయలు వసూళ్లు చేసినట్లు చెప్పారు. మండలంలోని కూర్మాపురం, కురకాళ్లపల్లి, నదురుబాద, పసలపూడి, వి.సావరం, వెదురుపాక, సోమేశ్వరం, వెంటూరు గ్రామ పంచాయతీల్లో నూరు శాతం వసూళ్లు సాధించినట్లు తెలిపారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న మలేరియా జిల్లా అధికారి వెంకటేశ్వరరావు

వలస కార్మికులకు రక్త పరీక్షలు నిర్వహించాలి

ఆత్రేయపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం నుండి మన జిల్లాలో పనుల కోసం వచ్చే వలస కార్మికులకు తరుచూ రక్త పరీక్షలు నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆత్రేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ల్యాబ్‌ను తనిఖీ చేసి ప్రతి జ్వరం కేసుకు సంబంధించి రక్తపరీక్షలు నిర్వహించాలని పాజిటివ్ కేసులకు సత్వరమే వైద్యం అందించాలన్నారు. గ్రామాల్లోని దోమలు వ్యాప్తి చెందకుండా మురుగునీటి ప్రాంతాలు నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో నివారణ చర్యలు చేపట్టి దోమల లార్వా అభివృద్ధి చెందకుండా ఎబెట్ మందును పిచికారి చేయాలన్నారు. మలేరియా, డెంగ్యూ దోమల ద్వారా వచ్చే ఇతర వ్యాధులను నిర్మూలించుకోవచ్చునన్నారు. ప్రతి ఫ్రైడే డ్రైడే పాటించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పలు సూచలను చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సౌమ్య, యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్లు సూర్యనారాయణ, విజయభాను పాల్గొన్నారు.



పాస్టర్ల సంఘం అధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించాలి

ఆలమూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతిపై విచారణ చేపట్టాలని కోరుతూ మండల పాస్టర్స్ ఫిలోషిప్ సంఘాల అధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. మెయిన్‌రోడ్డు నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. దీనిపై విచారణ చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని పాస్టర్స్ సంఘం మండల నాయకులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాస్టర్స్ సంఘ మండల నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.